ప్రజాశక్తి

శనివారం 18 ఫిబ్రవరి 2023

8 పేజీలు

విశాఖపట్నం అనకాపల్లి






జూ ప్రవేశం.. ధరాభారం

◆ ప్రవేశ రుసుం పెంపుపై పలువురు మండిపాటు ◆ ముందస్తు ప్రకటన లేకుండానే దర్శనమిచ్చిన ధరల పట్టిక

ప్రజాశక్తి - ఆరిలోవ

నగరంలో ఉన్న ఇందిరా గాంధీ జంతు ప్రదర్శన శాల సందర్శకుల ప్రవేశ ధరలు ఒక్కసారిగా పెరిగాయి. ముందస్తు ప్రకటనేమీ లేకుండానే జూ ప్రవేశ ద్వారం వద్ద ధరల పట్టిక దర్శనమిచ్చింది. ఎంతో దూరాభారం నుంచి వచ్చిన సందర్శకులు ఈ ధరల పట్టికను చూడగానే అవాక్కవుతున్నారు. తిరిగి వెళ్ళలేక.. పెంచిన ధరలను చూసి అసహనం, అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది జనవరి 19న జరిగిన జూ అథారటీ ఆఫ్ ఎపి సమావేశంలో జూ ప్రవేశ టిక్కెట్ ధరలను సవరిస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఈ విషయంపై ఎటువంటి ప్రకటనా చేయకుండానే కొత్త ధరల పట్టికను అధికారులు తగిలించేశారు.



ధరల పట్టిక



జూ పార్కు ముఖద్వారం

భారం ఇలా..

కొత్త ధరల ప్రకారం పెద్దలకు రూ.70, పిల్లలకు రూ.30, వీడియో కెమెరాకు రూ.200, స్టిల్ కెమెరాకు రూ.50, కారుకు రూ.750, విదేశీ పెద్దలకు రూ.200, పిల్లలకు రూ.100, లోపల బ్యాటరీ వాహనాలకు పెద్దలకు రూ.70, పిల్లలకు రూ.30 చొప్పున చెల్లించాలి. పాత ధరల ప్రకారం జూ లోపలకు ప్రవేశించేందుకు పెద్దలకు రూ.50, పిల్లలకు మిగతా 2లో..

ధరలు చూసి అవాక్కయ్యాం



వివాహ వేడుక కోసం కాకినాడ నుంచి మా బంధువులు వచ్చారు. వారిని కారులో జూ పార్కుకు తీసుకుని వచ్చాను. కారుకు రూ.750, కారులో వచ్చిన మా ఐదుగురికి ప్రవేశ ధర రూ.350 కలిపి రూ.1,100 చెల్లించాల్సి వచ్చింది. పెరిగిన ధరల విషయం తెలియకుండా వచ్చాం. ధరలు చూసి తిరిగి వెనక్కి వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. పెంచిన ధరలు ముందుగా తెలిస్తే దానికి సిద్ధపడే వచ్చేవారం. ఇలా చేయడం మంచి పద్ధతి కాదు

శ్యామ్‌సన్, కైలాసపురం

మృత శిశువుకు అంబులెన్స్ కరువు ఘటనపై..

బాలల హక్కుల కమిషన్ సీరియస్



కెజిహెచ్ వైద్యాధికారులతో సమావేశమైన సీతారాం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : అల్లూరి సీతారామరాజు జిల్లా ముంచింగిపుట్టు మండలానికి చెందిన మత్స్యరాజు దంపతుల బిడ్డ కెజిహెచ్‌లో మృతిచెందగా, ఆ చిన్నారిని స్వస్థలానికి తరలించేందుకు అంబులెన్స్‌ను సమకూర్చడంలో ఆసుపత్రి సిబ్బంది చూపిన నిర్లక్ష్యంపై ఎపి బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సీరియస్ అయింది. సామాజిక మాధ్యమాల్లో వస్తున్న వార్తలపై స్పందించింది. ఆసుపత్రి సిబ్బంది, ఎస్టీ సెల్ నిర్లక్ష్యం వల్ల 120 కిలోమీటర్లు దూరం ద్విచక్ర వాహనంపై శిశువు మృతదేహాన్ని తీసుకువెళడాన్ని పరిశీలించి ఆ కేసును సుమోటోగా స్వీకరించి సంబంధిత అధికారులు, సిబ్బందికి నోటీసులు జారీ చేయనున్నామని కమిషన్ సభ్యులు డాక్టర్ గొండు సీతారాం తెలిపారు. శుక్రవారం కెజిహెచ్ ఆసుపత్రికి చేరుకున్న ఆయన ఆసుపత్రి సూపరింటెండెంట్ ఛాంబర్‌లో సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్ కుమార్, ఆర్ఎంఒ, ఎఆర్ఎంఒలు, ఎస్టీ సెల్ సిబ్బందితో సమావేశమయ్యారు. శిశువు మరణానికి వైద్య విధాన కారణాలపై ఆరా తీశారు. గిరిజన ప్రాంతాల బాలలకు అనారోగ్య పరిస్థితులు ఎదురైతే వారు కెజిహెచ్‌కు చేరుకునేందుకు ప్రత్యేకంగా ఎన్ని అంబులెన్స్‌లు వినియోగిస్తున్నారు, చనిపోయిన పిల్లలను ఆసుపత్రి సిబ్బంది ఎలా వారి సొంత ప్రాంతాలకు చేరవేస్తారు, ఎన్ని ప్రత్యేక వాహనాలు వినియోగిస్తున్నారు, ప్రత్యామ్నాయ రవాణా ఏర్పాట్లు ఏమైనా ఉన్నాయా ? తదితర అంశాలపై సమాచారం సేకరించారు. అనంతరం సీతారాం మీడియాతో మాట్లాడుతూ ద్విచక్ర వాహనంపై శిశువు మృతదేహం తరలింపు విధానం సరికాదన్నారు, భవిష్యత్తులో ఇటువంటివి పునరావృతం కాకుండా అధికారులు, సిబ్బందిపై క్రమశిక్షణ చర్యలతో పాటు అవసరం అనుకుంటే ఉద్యోగాల నుండి సస్పెండ్ చర్యలు చేపట్టాలని ఆయా జిల్లాల ఉన్నతాధికారులకు, పాడేరు ఐటిడిఎ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయనున్నట్టు చెప్పారు. బాలల హక్కుల పరిరక్షణకు రాష్ట్రంలోని అన్ని శాఖల అధికారులు, సిబ్బంది తోడ్పాటును అందించాల్సిందేనని సూచించారు. బాలల హక్కులకు ఎక్కడ విఘాతం మిగతా 2లో..

దేశాభివృద్ధిలో సాంకేతికత కీలకం

▶ వార్త మెయిన్‌లో..

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలు ప్రారంభం

▶ వార్త 4లో..

రెండో రోజూ ఒక్కరే నామినేషన్

▶ వార్త 2లో..



స్టేడియంలోని ఏర్పాట్లును పరిశీలిస్తున్న కలెక్టర్, జివిఎంసి కమిషనర్, పోలీసు కమిషనర్

పకడ్బందీగా భారత్, ఆసీస్ వన్డే మ్యాచ్

నిర్వహణపై జిల్లా అధికారులు, ఎసిఎ ప్రతినిధుల సమీక్ష వార్త 4లో..

ఎస్‌బిసి బ్రిడ్జిపై

రాకపోకలకు అనుమతించాలి

కలెక్టర్‌కు సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు లేఖ

ప్రజాశక్తి - కలెక్టరేట్ : పార్లల్ బ్రిడ్జిని మరమ్మతులరీత్యా 15 నెలలపాటు మూసివేస్తున్నందున రక్షణ రంగ షిప్ బిల్డింగ్ సెంటర్ (ఎస్‌బిసి) బ్రిడ్జి మీదుగా రాకపోకలకు ప్రజలను అనుమతించాలని సిపిఎం 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా కలెక్టర్‌కు ఆయన లేఖ రాశారు. ఆ విషయాలను మీడియాకు వెల్లడించారు. విశాఖపట్నం ప్రధాన నగరాన్ని పారిశ్రామిక ప్రాంతంతో కలుపుతూ 1968లో సర్దార్ వల్లభాయ్ పటేల్ (పార్లల్ బ్రిడ్జి) నిర్మాణమైందన్నారు. నిత్యం వేల వాహనాలు, లక్షల మంది ప్రజలు ఈ మార్గంగుండా ప్రయాణిస్తుండేవారని తెలిపారు. నేవెల్ డాక్ యార్డ్, షిప్ బిల్డింగ్ సెంటర్, తూర్పు నౌకాదళంలోని ప్రధాన కేంద్రం, దాని ఉప కేంద్రాలు, హిందుస్థాన్ షిప్‌యార్డ్, కోరమండల్, హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్, ఆంధ్ర పెట్రోలియం కార్పొరేషన్, అనేక గొడౌన్లల్లో పనిచేస్తున్న సుమారు 50 వేల మంది ఈ రహదారి గుండా నిత్యం ప్రయాణించేవారని తెలిపారు. నేడు ఈ బ్రిడ్జ్ శిథిలావస్థకు చేరుకుందని, తక్షణమే మరమ్మతులు చేయాలని విశాఖ పోర్టు ట్రస్ట్ నిర్ణయించి, 15 నెలలు బ్రిడ్జిని మూసివేస్తున్నట్లు ప్రకటించిందన్నారు. ఈ పార్లల్ బ్రిడ్జిని మూసివేస్తే ఏడు కిలోమీటర్లు చుట్టూ తిరిగి రావలసి ఉంటుందన్నారు. వివిధ పరిశ్రమలలో మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

జూ ప్రవేశం.. ధరాభారం

రూ.30, వీడియో కెమెరాకు రూ.150, స్టిల్ కెమెరాకు రూ.30, కారుకు రూ.500, లోపల బ్యాటరీ వాహనాలకు పెద్దలకు రూ.50, పిల్లలకు రూ.20 చొప్పున ఉండేవి. సందర్శకులకు వినోదంతో పాటు విజ్ఞానాన్ని అందించే జూ పార్కులో ప్రవేశ ధరలు పెంచడంపై సందర్శకులు, సామాజిక కార్యకర్తలు మండిపడుతున్నారు. చిన్నారులు అమితంగా ఇష్టపడే జూ పార్కు వంటి ప్రదేశాలను వ్యాపార కోణంలో చూడరాదంటున్నారు. చిన్నారులను విజ్ఞానానికి, వినోదానికి దూరం చేయడం మంచిది కాదని కొంతమంది పెద్దలు చెబుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, జూ అథారిటీ అధికారులు ఆలోచించి ప్రవేశ ధరలను అందరికీ అందుబాటులో ఉంచాలని కోరుతున్నారు.

ప్రవేశ ధరలు పెంచడం దారుణం

జూ అభివృద్ధి పేరుతో ప్రవేశ ధరలను అధిక మొత్తంలో పెంచడం దారుణం. వినోదం, విజ్ఞానం కోసం దూరాభారం నుంచి జూ పార్కుకు వస్తే ఇక్కడ ధరలు ఘోరంగా ఉన్నాయి. ముందుగా తెలిస్తే వచ్చేవారం కాదు. జూ అభివృద్ధి పేరుతో సందర్శకులపై ఇటువంటి భారం వేయడం అన్యాయం. ధరల పెంపు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి.

భాస్కరరావు, కొమ్మాది

అంతర్జాతీయ స్థాయికి చేరేందుకే..

అంతర్జాతీయ స్థాయికి జూ పార్కును తీసుకు వెళ్ళే క్రమంలోనే ఇక్కడి అభివృద్ధికి సంబంధించి జూ పార్కు ప్రవేశ ధరలను పెంచాం. ఐదేళ్ల తరువాత ప్రవేశ ధరలను స్వల్పంగా పెంచాం.

అనంత్ శంకర్, జూ ఇన్‌ఛార్జి క్యూరేటర్

బాలల హక్కుల కమిషన్ సీరియస్

కలిగినా కమిషన్ తనదైన శైలిలో చట్టప్రకారం చర్యలకు సిద్ధంగా ఉంటుందని అన్నారు. ఈ సమావేశంలో పిల్లల వైద్యులు డాక్టర్ బిఎస్.చక్రవర్తి, డాక్టర్ వసుదేవ, డాక్టర్ చక్రవర్తి, డాక్టర్ రమ్య, డాక్టర్ అరుణ దేవి, డాక్టర్ భవాని శంకర్, 1098 జిల్లా కో-ఆర్డినేటర్ డేవిడ్ రాజు, డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ రమేష్, సిఆర్‌పిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ బి.శకుంతల, అల్లూరి సీతారామరాజు జిల్లా కన్వీనర్ డాక్టర్ లవకుశ, ఫోరం ప్రతినిధులు డాక్టర్ ఆదిమూర్తి, కె.ఎల్లయ్య, ప్రవీణ, డాక్టర్ జగ్గారావు, బొడ్డేపల్లి సంతోష్, ఒన్ స్టాప్ సెంటర్ ప్రతినిధి శరణ్య తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌బిసి బ్రిడ్జిపై రాకపోకలకు అనుమతించాలి

పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికులు ప్రధాన నగరంలోకి రావాలనుకున్నా అవస్థలు పడాల్సిందేనన్నారు. పారిశ్రామిక ప్రాంత ప్రజలకు ఇది చాలా ఇబ్బందికరమన్నారు. బ్రిడ్జి మరమ్మతులు పూర్తయ్యేంతవరకు రక్షణ రంగ అవసరాలరీత్యా నిర్మించిన ఎస్‌బిసి బ్రిడ్జిని తగిన భద్రతా చర్యలు తీసుకొని, ప్రజల రాకపోకలకు అనుమతించాలని విజ్ఞప్తి చేశారు. ఈ బ్రిడ్జిని ఉపయోగ పెట్టుకోవడం ద్వారా సమయంతో పాటు వేల కోట్ల రూపాయల ఇంధనం ఆదా అవుతుందన్నారు. ప్రజలపై అదనపు ఆర్థిక భారం పడకుండా, ఇక్కట్లు తగ్గుతాయని తెలిపారు. 2014 నుంచి రక్షణ రంగ కార్మికులకు ప్రాతినిధ్యం వహిస్తున్న డిఫెన్స్ కో-ఆర్డినేషన్ కమిటీ భాగస్వామ్య యూనియన్లు పార్లల్ బ్రిడ్జి పాతబడి తరచూ రిపేర్లు అవుతున్నాయని, దీని స్థానంలో కొత్త బ్రిడ్జిని నిర్మించాలని డిమాండ్ చేస్తూ వచ్చాయని గుర్తు చేశారు. ప్రజాప్రతినిధులకు, నౌకాదళ అధికారులకు, విశాఖ జిల్లా, పోర్టు అధికారులకు ఆ సమస్యను విన్నవించాయన్నారు. ఆనాడే స్పందించి కొత్త బ్రిడ్జి నిర్మాణం చేపట్టి ఉంటే ఈ రోజు సమస్య ఉత్పన్నమయ్యేది కాదన్నారు. ఇప్పటికైనా కొత్త బ్రిడ్జి నిర్మాణానికి పూనుకోవాలన్నారు. దీనిపై కలెక్టర్, విశాఖ నగర మేయర్ ప్రత్యేక బాధ్యత తీసుకొని షిప్ బిల్డింగ్ సెంటర్ అధికారులు, తూర్పు నౌకాదళ అధికారులతో మాట్లాడి సి బిల్డింగ్ సెంటర్ వంతెనను ప్రజల రాకపోకలకు అనుమతించాలని కోరాలని విజ్ఞప్తి చేశారు. కొత్త బ్రిడ్జి నిర్మాణం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకురావాలన్నారు.

వివాహితపై వేధింపుల కేసులో ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం సాయంత్రం షాపింగ్ చేసుకొని ఇంటికి నడిచి వెళ్తున్న ఒక కుటుంబంపై ఆకతాయిలు వేధింపులకు పాల్పడటమే కాకుండా వివాహితపై దాడికి యత్నించి, ఆమె వస్త్రాలను చించేసిన ఘటన నగరంలో తీవ్ర సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. ఈ కేసులో ఇద్దరిని శుక్రవారం అరెస్టు చేశారు. పోలీసుల కథనం మేరకు.. పూర్ణామార్కెట్ దరి రంగిరీజు వీధిలో నివాసముంటున్న సుధాదేవి, రాజు, దీప్తి బుధవారం రాత్రి షాపింగ్ ముగించుకొని ఇంటికి వెళ్తున్న సమయంలో మద్యం, గంజాయి మత్తులో ఉన్న ఆకతాయిలు వీర్రాజు, సంపత్‌లు ద్విచక్రవాహనంపై వెళ్తూ గట్టిగా హారన్ మోగించి వారు భయపడేలా చేశారు. దీంతో దీప్తి భయపడి గట్టిగా కేకలు వేసింది. దీంతో వారు ఆ యువకులను హెచ్చరించారు. అనంతరం ఆ యువకులు భార్యాభర్తలపై విచక్షణ రహితంగా దాడి చేశారు. వివాహిత పట్ల అసభ్యంగా ప్రవర్తించారు. ఆమె దుస్తులను చించేశారు. వివాహిత తన తమ్ముడు అభిలాష్‌కు ఫోన్‌లో సమాచారం ఇవ్వగా అతను వచ్చి యువకులతో వాగ్వాదానికి దిగాడు. అతడ్ని కూడా ఆ యువకులు తీవ్రంగా గాయపరిచారు. దీంతో బాధిత కుటుంబం ఆసుపత్రిలో చేరింది. అనంతరం వన్‌టౌన్ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదు చేశారు. వీర్రాజు, సంపత్‌లను అరెస్ట్ చేశారు.



నామినేషన్ పత్రాలు అందజేస్తున్న అప్పలరాజు

రెండో రోజూ ఒక్కరే నామినేషన్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఎపి శాసనమండలి విశాఖపట్నం -విజయనగరం - శ్రీకాకుళం పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికకు సంబంధించి శుక్రవారం కూడా ఒక్క అభ్యర్థే జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జునకు తన నామినేషన్ పత్రాలు అందజేశారు. ఆనందపురం మండలం, తర్లువాడ గ్రామానికి చెందిన ఇల్లిపల్లి అప్పలరాజు స్వతంత్ర అభ్యర్థిగా ఒక సెట్ నామినేషన్ దాఖలు చేశారు. గురువారం రెండు సెట్ల పత్రాలు నామినేషన్ దాఖలు చేసిన పిడిఎఫ్ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ తిరిగి శుక్రవారం మరొక రెండు సెట్ల నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారికి అందజేశారు. పట్టభద్రుల శాసన మండలి ఎన్నికలకు సంబంధించి ఈ నెల 16న నోటిఫికేషన్‌రాగా రెండో రోజు శుక్రవారం నాటికి మొత్తం ఇద్దరు అభ్యర్థులు ఐదు సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు.

ప్రభుత్వ సెలవు దినాల్లో నామినేషన్లు స్వీకరించబడవు : మల్లికార్జున

శనివారం శివరాత్రి ప్రభుత్వ సెలవు దినం, ఆదివారం ప్రభుత్వ సెలవు దినం కావున ఆ రెండు రోజులలో నామినేషన్లు స్వీకరించబడవని ఎన్నికల అధికారి మల్లికార్జున తెలిపారు.

మెరుగైన ఫలితాలకు అవగాహన కీలకం



అవగాహన కల్పిస్తున్న నిహాల్

ప్రజాశక్తి- కలెక్టరేట్ : పరీక్షల సమయంలో మెరుగైన ఫలితాల కోసం విద్యార్థులు సన్నద్ధం కావలసిన అవసరం ఎంతైనా ఉందని కౌసల్య కౌన్సిలింగ్ సెంటర్ వైద్య నిపుణులు డాక్టర్ ఎన్‌జి.నిహాల్ అన్నారు. శుక్రవారం డాబాగార్డెన్స్‌లోని పెన్ స్కూల్ పదో తరగతి విద్యార్థులకు 'పరీక్షలను ఎలా ఎదుర్కోవాలి' అనే అంశంపై ఆయన అవగాహన కల్పించారు. పరీక్షలతో విద్యార్థులపై ఒత్తిడి పెరిగే సమయం వచ్చేసిందన్నారు. ఈ సమయంలో ఆందోళన, దిగులు, చికాకు కలిగి ఉండడం, నిరాశతో భావోద్వేగాలకు గురికావడం సహజమన్నారు. ఈ సమయంలో ఏకాగ్రత, జ్ఞాపకశక్తి, అవగాహన కలిగి ఉండడం అత్యవసరమన్నారు. ఈ సమయంలో పరీక్షలను ఎదుర్కొనే వనరులను సమకూర్చుకొని విద్యార్థులు ఉత్తమ ఫలితాలను రాబట్టాలని సూచించారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చంద్రబాబు సభను అడ్డుకోవడం దారుణం



కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న టిడిపి నేతలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : తూర్పుగోదావరి జిల్లా అనపర్తి మెయిన్ రోడ్డులో టిడిపి జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు సభను అక్కడ పోలీసులు జరగకుండా అడ్డుకోవడాన్ని ఖండిస్తూ శుక్రవారం సాయంత్రం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద టిడిపి ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ విశాఖ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, దక్షిణ ఇన్‌ఛార్జి గండి బాబ్జీ మీడియాతో మాట్లాడుతూ సైకో ముఖ్యమంత్రి జగన్ పాలనలో ప్రజాస్వామ్యం మంట కలిసిందని మండిపడ్డారు. ప్రతిపక్షాల సభను అడ్డుకోవడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో విల్లూరి డాక్టర్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌తో వేల మందికి ఉపాధి

ప్రజాశక్తి - కలెక్టరేట్

ప్రభుత్వ రంగంలో వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ఉన్నందునే ఆ కర్మాగారంలో ప్రత్యక్షంగా 30 వేల మంది, పరోక్షంగా లక్ష మంది ఉపాధి పొందుతున్నారని సిఐటియు స్టీల్‌ప్లాంట్ జోన్ నాయకులు వి.నారాయణమూర్తి అన్నారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి చేపట్టిన దీక్షలు శుక్రవారానికి 687వ రోజుకు చేరాయి. దీక్షలో సిఐటియు స్టీల్ ప్లాంట్ జోన్ కార్మికులు కూర్చున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలువురి త్యాగాలతో స్టీల్‌ప్లాంట్ ఏర్పాటైందన్నారు. అటువంటి కర్మాగారాన్ని ప్రైవేటుపరం చేస్తే ఉపాధికి నష్టమన్నారు. ప్రభుత్వ రంగంలోనే దీనిని కొనసాగించాలని డిమాండ్ చేశారు. దీక్షలో యూనియన్ నాయకులు కొవిరి అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ అనర్థాలపై అవగాహన



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎస్ఇబి సిఐ, ఎస్ఐలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : మాదకద్రవ్యాల వాడకం వల్ల కలిగే అనర్థాలపై స్థానిక ఎస్‌విఎల్ఎన్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్పెషల్ ఎన్ఫోర్స్ మెంట్ బ్యూరో ఆధ్వర్యంలో శుక్ర వారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఇబి సిఐ రామకృష్ణ, ఎస్ఐ పద్మావతి డ్రగ్స్‌కు బానిసలైతే యువత జీవితం నాశనమౌతుందని వివరించారు. మాదకద్రవ్యాల వినియోగానికి సంబంధించి పలు చట్టాలపై అవగాహన కల్పించారు. పోస్టర్‌ను ఆవిష్కరించారు. డ్రగ్స్ విక్రయాలు, వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిస్తే అందించి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కె విద్యాసాగర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు జ్యోతి, అప్పలనాయుడు, శ్రీనివాసరావు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న మేయర్

ప్రజాశక్తి- పిఎం పాలెం: మధురవాడ శిల్పారామం వేదికగా మధురవాడ ఇంగ్లీష్ మీడియం స్కూల్ 30వ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, ఎపిపిఎస్ఎ రాష్ట్ర ఛైర్మన్ కెఎస్ఎన్.మూర్తి, ఎయు కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డిఎస్ ఎన్ సోమయాజులు పాల్గొని జ్యోతి ప్రజ్వలనతో వార్షికోత్సవాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలు, నృత్యాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. వివిధ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు మేయర్ హరివెంకటకుమారి బహుమ తులను అందజేశారు. పాఠశాల హెడ్ మిస్ట్రెస్ జె. ఉష శ్రీ, ఎపిపిఎస్ఎ సెక్రెటరీ బివి మురళీ మనోహర్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎపి ఎంఆర్‌పిఎస్ కమిటీల ఏర్పాటు

ప్రజాశక్తి- పద్మనాభం : ఉత్తరాంధ్రలో ఎపి ఎంఆర్పిఎస్ బలోపేతానికి, సమస్యల పరిష్కారానికి వీలుగాజిల్లా, నియోజకవర్గ, మండల, గ్రామ స్థాయిలో కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు ఎంఆర్పిఎస్ ఉత్తరాంధ్ర కన్వీనర్ దేవరాపల్లి గణేష్ అన్నారు. శుక్రవారం పెంటగ్రామంలో అంబేద్కర్,జగ్జీవన్‌రాం విగ్రహాల వద్ద నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో మాట్లాడుతూ, దళిత వాడల్లో సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి కృషి చేయాలని నిర్ణయించారు. గ్రామస్థాయిలో ఎంఆర్పిఎస్ బలోపేతం ద్వారా సమస్యలపై పోరాటానికి వీలుంటుందన్నారు. కార్యక్రమములో ఎపి ఎంఆర్పిఎస్ ఉత్తరాధ్ర నాయకులు డి రమణమ్మ, .కింతాడ దేముడు, .నిమ్మకాయల ఆదిలక్ష్మి, కె గురునాధరావు, అప్పారావు, .కాకర్ల రమణ.పాల్గొన్నారు.

అధికారుల స్పందనపై హర్షం

ప్రజాశక్తి -భీమునిపట్నం : తమ విజ్ఞప్తి మేరకు, జివిఎంసి రెండో వార్డు ఆదర్శనగర్‌లో సమస్యల పరిష్కారానికి అధికారులు చొరవ తీసుకోవడంపై జాతీయ మానవ హక్కుల కమిషన్(విపత్తుల శాఖ) రాష్ట్ర ఉపాధ్యక్షులు శీరపు రామలక్ష్మి శుక్ర వారం ఒక ప్రకటనలో హర్షం వెలిబుచ్చారు. ఆదర్శనగర్‌లో సిమెంట్ రోడ్లు,కాలువల నిర్మాణం, మరమ్మతు పనులు చేపట్టడంపై ఆనందం వ్యక్తం చేశారు.

విజ్ఞానాధారిత ఆర్థిక ప్రగతి అవసరం



మాట్లాడుతున్న గీతం విసి దయానంద

ప్రజాశక్తి -మధురవాడ : ప్రజాసంక్షేమంతో పాటు సంపదను సృష్టించే ఆర్థిక వ్యవస్థను రూపొందించాలని, ముఖ్యంగా విజ్ఞాన ఆధారిత ఆర్థిక ప్రగతి దేశానికి అవసరమని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ దయానంద సిద్ధవటం అభిప్రాయపడ్డారు. ఇనిస్టిట్యూట్ ఫర్ డెవలప్‌మెంట్ స్టడీస్ ఆంధ్రప్రదేశ్, గీతం స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఇండియన్ పొలిటికల్ ఎకానమీ అసోసియేషన్ (ఐపిఇఎ) 26వ వార్షిక సమావేశాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, అధికారంలోకి రావడానికి ఆర్థిక వనరులను ఒక ప్రణాళిక లేకుండా ఖర్చు చేయడం సరికాదన్నారు. ఉన్నత విద్య, పరిశోధనా రంగాలకు నిధుల కేటాయింపు పెరగాలని, దేశంలో మౌలిక సదుపాయాల వృద్ధిపై ప్రభుత్వాలు దష్టి సారించాలని సూచించారు. గీతం ప్రొ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ వై. గౌతంరావు మాట్లాడుతూ దేశంలో ద్రవ్యోల్బణం, నిరుద్యోగం పెరగడంతో రూపాయిపై తీవ్ర ఒత్తిడి ఉందని,ప్రపంచ ఆర్థిక పరిస్థితులను గమనిస్తూ దేశ ఆర్థిక ప్రణాళికలలో మార్పులు చేసికోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రాంతీయ పార్టీల ప్రాబల్యం పెరుగుతోన్న పరిస్థితుల్లో రాజకీయాలను, ఆర్థిక రంగాన్ని వేర్వేరుగా చూడలేమని అభిప్రాయ పడ్డారు.

గీతం స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ విశిష్ట ప్రొఫెసర్ డాక్టర్ కె. చిన్నయ్యసూరి భారతదేశంలో ప్రభుత్వాలు ప్రైవేటీకరణ వైపు మొగ్గు చూపడం సరికాదని, చట్టసభల నిర్వహణ తీరు ప్రజాస్వామ్యం అర్థాన్నే మార్చేశాలా ఉన్నాయని అభిప్రాయ పడ్డారు. ఇండియన్ పొలిటికల్ ఎకానమీ అసోసియేషన్ (ఐపిఇఎ) చైర్ పర్సన్ ప్రొఫెసర్ టి. ఉపాధ్యాయ మాట్లాడుతూ రాజకీయ అంశాలను, ఆర్థిక అంశాలను జోడించిన పొలిటికల్ ఎకానమీపై అధ్యయనాలు అవసరమని, దీనికి అధ్యాపకులు, విద్యార్థులతో ఐపిఇఎ ద్వారా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో గీతం స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ డైరెక్టర్ ప్రొఫెసర్ బి. నళిని, ఇనిస్టిట్యూట్ ఫర్ డెవలప్మెంట్ స్టడీస్ ఆంధ్రప్రదేశ్ డైరెక్టర్ ప్రొఫెసర్ గాలిబ్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ నాగభూషణరావు, సెంటర్ ఫర్ ఎకనామిక్ స్టడీస్ అండ్ ప్లానింగ్ ప్రొఫెసర్ సురజిత్ మజుందార్ పాల్గొన్నారు.

మృతశిశువు ఘటనకు బాధ్యత వహిస్తూ

మంత్రి రజని రాజీనామా చేయాలి

జనసేన కార్పొరేటర్ మూర్తి యాదవ్

ప్రజాశక్తి-సీతమ్మధార : పసికందు మృతదేహానికి అంబులెన్స్ ఏర్పాటు చేయలేని దౌర్భాగ్యస్థితిలో ఉన్న విశాఖ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజని తన పదవికి రాజీనామా చేయాలని జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ డిమాండ్ చేశారు. శుక్రవారం పౌర గ్రంథాలయంలో విలేకరులతో మాట్లాడుతూ, సిఎం జగన్‌తో సహ మంత్రులు, ప్రభుత్వ పెద్దలంతా అనునిత్యం విశాఖ నామజపం చేస్తూ, దృష్టంతా ఇక్కడే కేంద్రీకరించిన పరిస్థితుల్లో ఇటువంటి ఘటన చోటుచేసుకోవడం దురదృష్టకరమన్నారు.

జనసేనాని పవన్ కల్యాణ్ స్పందించేసరికి రాష్ట్ర ప్రభుత్వం ఉలిక్కిపడి నష్టనివారణ చర్యలకు పూనుకుందన్నారు. ఇంటింటికీ వైద్యులను పంపిస్తామని ఆర్భాటం చేస్తున్న ప్రభుత్వం, కెజిహెచ్ వంటి ప్రఖ్యాత ఆసుపత్రికి వస్తే వైద్యం, ఇతర సదుపాయాలు కల్పించలేని దుస్థితిలో ఉందని మండిపడ్డారు. రాజధాని పేరుతో రియల్ దందా చేసుకోవడం తప్ప, గిరిజనుల, దళితుల, పేద ప్రజల ఆరోగ్యంపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని ఆరోపించారు. మూడు నెలల్లో పది మాతాశిశు మరణాలు సంభవించాయని సాక్షాత్తు కలెక్టర్ చెబుతుండగా, నేటికీ గ్రామాల్లో డోలిమోతలే దిక్కుగా ఉన్నాయన్న అనేక ఉదంతాలు వెలుగు చూస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం ఏం చర్యలు చేపడుతోందని ప్రశ్నించారు. జనసేన ఉత్తర నియోజకవర్గం ఇంచార్జ్ ఉషాకిరణ్ మాట్లాడుతూ ఉత్తరాంధ్ర ఆరోగ్య ప్రదాయిని కెజిహెచ్‌లో ఇటువంటి సంఘటన జరగడం దురదృష్టకరమన్నారు.కార్పొరేటర్ బిసెట్టి వసంతలక్ష్మి, కందుల నాగరాజు, జనసేన సీనియర్ నాయకులు గోపికృష్ణ (జికె), శివప్రసాద్ రెడ్డి, రూప పాల్గొన్నారు.

సమస్యలపై ఉపాధ్యాయుల ఆందోళన



పెందుర్తిలో ఆందోళన చేస్తున్న ఎపిటిఎఫ్ ఉపాధ్యాయులు

ప్రజాశక్తి - ఆరిలోవ: అపరిష్కృత ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎపిటిఎఫ్ ఆధ్వర్యాన శుక్రవారం చినగదిలి తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. ఒకటో తేదీనాటికి నెలసరి వేతనాల చెల్లింపు, సిపిఎస్ రద్దు, 3, 4, 5 తరగతుల విలీనాన్ని ఆపాలని, యాప్‌ల పేరుతో ఉపాధ్యాయులపై వేధింపులు ఆపాలని, శాశ్వత ప్రాతిపదికన ప్రమోషన్ ఇవ్వాలని, డిఎస్‌సి ద్వారా ఉపాధ్యాయ నియామకాలు జరపాలని, పెండింగ్‌లో ఉన్న మూడు డిఎలను వెంటనే చెల్లించాలన్న తదితర డిమాండ్లతో నినాదాలు చేస్తూ ఆందోళన చేపట్టారు. చినగదిలి తహసిల్దారు రమణయ్యకు వినతిపత్రం అందజేసారు.కార్యక్రమంలో ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, రాష్ట్ర కౌన్సిలర్ శ్యామ్‌కుమార్, కార్యదర్శులు సునీత, నీరజ, దయానిధి పాల్గొన్నారు

పెందుర్తి : పాదయాత్ర సమయంలో సిఎం జగన్ ఇచ్చిన హామీలు, ఇతర ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎపిటిఎఫ్ ఆధ్వర్యంతో స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టి, తహశీల్దార్‌కు వినతిపత్రం అందించారు. సంఘం మండలశాఖ అధ్యక్షుడు ఎ.కె.ఈశ్వరరావు, జనరల్ సెక్రటరీ సన్నీ బాబు, జిల్లా వైస్ ప్రెసిడెంట్ జగదీష్, మండల స్థాయి నాయకులు పాల్గొన్నారు

నెలాఖరులోగా వేతన సవరణ చేయకుంటే ప్లాంట్ ముట్టడి

ప్రజశక్తి-ఉక్కునగరం : విశాఖ స్టీల్ ప్లాంట్ ఉద్యోగులకు ఫిబ్రవరి నెలాఖరు లోపు వేతన సవరణ చేయకపోతే ప్లాంట్ ముట్టడి చేస్తామని ఇంటక్ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్ హెచ్చరించారు. కార్మికులకు వేతన సవరణలో జాప్యాన్ని నిరసిస్తూ శుక్రవారం ప్లాంట్ బిసి గేటు వద్ద భారీఎత్తున ధర్నా నిర్వహించారు. నాయకులు కారు రమణ, గొందేశి మహేశ్వరరెడ్డి, ఎస్ఎ.నాయుడు, గొందేశి ప్రభాకరరెడ్డి, బి.వేణువర్మ, మొల్లి ఈశ్వరరావు, మంత్రి గోపి నారా యణ, గంట్యాడ గురుమూర్తి, కోవిరి అవతారం,డి.సాహూ, బిఎంఈ.నాయక్, గోపిశెట్టి వెంకటరావు, పోలీస్ నాయుడు, వంశీ,సుదర్శనరావు, అప్పలరెడ్డి, ఎంఎస్ఆర్.ప్రసాద్, హరనాద్, కామరాజు, త్రిమూర్తులు, కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

మహాశివరాత్రి పూజలకు సిద్ధం

ప్రజాశక్తి -ఆనందపురం: మండలంలోని గుడిలోవ శ్రీ రంగనాథస్వామి దేవాలయంలో మహాశివరాత్రి ప్రత్యేక పూజలకు అన్ని ఏర్పాట్లు చేశామని ఆలయ కమిటీ ఛైర్మన్ కోరాడ గిరిరాజు తెలిపారు. 144ఏళ్లకు ఒకసారి మాత్రమే వచ్చే ప్రత్యేకమైన మహాశివరాత్రి ఈ ఏడాది వస్తోందని, ఈ పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తులందరూ స్వయంగా శివలింగాలకు పూజాభిషేకాలు చేసేలా ప్రత్యేక ఏర్పాట్లు చేశామని, ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు ఆలయ కమిటీ డైరెక్టర్ చందల అప్పలరాజు, ధనియాల చంద్రలక్ష్మి, పిల్లా శ్రీను, కోరాడ రోహిణి, బోని అప్పలకొండ, ఈతలపాక అప్పయ్యమ్మ, ఉన్నారు.

మధురవాడ: ఏడవ వార్డు మానం ఆంజనేయులు నగర్‌లో లలిత త్రిపుర సుందరి సమేత మహా కామేశ్వరస్వామి దేవాలయంలో మహాశివరాత్రి ఉత్సవానికి ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ధర్మకర్త బొడ్డేపల్లి సురేష్ తెలిపారు. శివరాత్రి ఉత్సవాలకు చుట్టూ పక్కల గ్రామాల నుంచి అధికసంఖ్యలో వచ్చే భక్తులకు ఇబ్బంది లేకుండా అవసరమైన ఏర్పాట్లు చేశామన్నారు.

వాటర్ ప్లాంట్లపై విజిలెన్స్ దాడులు



పరిశీలిస్తున్న విజిలెన్స్అదనపు ఎస్‌పి స్వరూపారాణి

ప్రజాశక్తి -కంచరపాలెం : నగరంలో ఎటువంటి అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న వాటర్ ప్లాంట్‌లపై విజిలెన్స్ అధికారులు శుక్రవారం దాడులు నిర్వహించారు. నగరంలోని మధురవాడ, అక్కయ్యపాలెం, అల్లిపురం సబ్బవరం తదితర ప్రాంతాల్లో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అదనపు ఎస్‌పి జి స్వరూపారాణి నేతృత్వంలో నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న వాటర్ ప్లాంట్లపై కేసును నమోదు చేసినట్లు వెల్లడించారు. ఆయా వాటర్ ప్లాంట్‌లో మంచినీటి శాంపిల్స్‌ను సేకరించి ల్యాబ్‌కు పంపిస్తామని, రిపోర్టుల ఆధారంగా నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. దాడుల్లో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిఐ లక్ష్మీజ, రేవతి, ఫుడ్ సేఫ్టీ అధికారులు వున్నారు

హక్కులతో పాటు బాధ్యతలు గుర్తెరగాలి



కేలండర్ ఆవిష్కరిస్తున్న సమితి సభ్యులు

ప్రజాశక్తి - ఆరిలోవ : రాజ్యాంగం పౌరులకు కల్పించిన హక్కులతో పాటు బాధ్యతలను గుర్తెరిగి ప్రవర్తించాలని ప్రపంచ మానవ హక్కుల సమితి జాతీయ ఛైర్మన్ డాక్టర్ బాలరాజు, ఛైర్మన్ మధుబాబు అనానరు.. శుక్రవారం ఆరిలోవ హెల్త్‌సిటీ లార్విన్ హోటల్‌లో ప్రపంచ మానవ హక్కుల సమితి ఆధ్వర్యంలో ఉత్తరాంధ్ర సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ ఆశయాలు, లక్ష్యాలు, చేస్తున్న కార్యక్రమాలను వారు వివరించారు. అనంతరం ప్రపంచ మానవ హక్కుల సమితి 2023 యాక్టివిటీ కేలండర్ ఆవిష్కరించారు.కార్యక్రమంలో సమితి ఎపి అడ్వయిజరీ కమిటీ ఛైర్మన్ ఆచారి, ఎపి ఛీఫ్ అబ్జర్వర్ కార్తీక్‌రామ్, రీజనల్ ఛైర్మన్ జానకిరామయ్య, ఉత్తరాంధ్ర సభ్యులు పాల్గొన్నారు.

విశ్రాంత సైనికులకు సన్మానం

ప్రజాశక్తి -తగరపువలస :ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన గుడివాడ గ్రామానికి చెందిన విశ్రాంత సైనికులు సిహెచ్ అప్పారావు, ఎస్ నరసింగరావులను శుక్రవారం గ్రామంలోఘనంగా సన్మానించారు. వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మాజీ సైనికుల హక్కుల పోరాట సమితి ఆర్గనైజింగ్ సెక్రటరీ సిహెచ్ వెంకట రెడ్డి, జి సూరిబాబు, సురేష్, విజయ్ ఉన్నారు

పకడ్బందీగా భారత్, ఆసీస్ వన్డే మ్యాచ్

నిర్వహణపై జిల్లా అధికారులు, ఎసిఎ ప్రతినిధుల సమీక్ష



మీడియాతో మాట్లాడుతున్న కలెక్టర్ మల్లికార్జున

ప్రజాశక్తి- పిఎం.పాలెం: ఆసీస్ జట్టు భారత పర్యటనలో భాగంగా మధురవాడ వైఎస్ఆర్ ఎసిఎ, విడిసిఎ క్రికెట్ స్టేడియంలో మార్చి 19న జరిగే రెండో వన్డే మ్యాచ్ నిర్వహణపై శుక్రవారం నిర్వహణ కమిటీ తొలి సమావేశాన్ని ఏర్పాటు చేశారు. జిల్లా కలెక్టర్ ఎ.మల్లికార్జున, నగర సిపి సిహెచ్. శ్రీకాంత్, జివిఎంసి కమిషనర్ పి.రాజాబాబు, ఎసిఎ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈసందర్భంగా మీడియా సమావేశంలో ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి గోపీనాథ్ రెడ్డి మాట్లాడుతూ ఈ స్టేడియంలో పలు మ్యాచ్‌లను సమర్థవంతంగా నిర్వహించిన నేపథ్యంలో బిసిసిఐ, మరోసారి భారత్, ఆసీస్ వన్డే మ్యాచ్ నిర్వహణకు మరో అవకాశం కల్పించిందన్నారు. భవిష్యత్తులో మరిన్ని మ్యాచ్‌ల నిర్వహణకు బిసిసిఐ సన్నద్ధత వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో ప్రతిమ్యాచ్‌ను విజయవంతంగా నిర్వహించాల్సిన బాధ్యత నిర్వహణ కమిటీపై ఉందన్నారు. ఈ మ్యాచ్‌కు సంబంధించి టిక్కెట్ల ధరలు, అమ్మకాలపై మరోసారి భేటీ అయి నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. అయితే ఆన్‌లైన్‌లో 70శాతం ఆఫ్‌లైన్‌లో 30 శాతం టిక్కెట్లు అందుబాటులోఉంచుతామన్నారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున మాట్లాడుతూ క్రికెట్ మ్యాచ్ నిర్వహణకు సంబంధించి ఏర్పాట్లపై చర్చించామన్నారు. గతంలో జరిగిన మ్యాచ్‌ల్లో కొన్ని లోటుపాట్లపై కూడా చర్చించామని, అన్ని శాఖల సమన్వయంతో ఈ మ్యాచ్‌ను సమర్థవంతంగా నిర్వహిస్తామన్నారు. మ్యాచ్ నాటికి ఎండలు తీవ్రమయ్యే పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని, తగు జాగ్రత్తలు తీసుకుంటామన్నారు. నగర పోలీస్ కమిషనర్ సిహెచ్ శ్రీకాంత్ మాట్లాడుతూ గతంలో మ్యాచ్‌ల సమయంలో తలెత్తిన ట్రాఫిక్ సమస్యలను దృష్టిలో పెట్టుకుని, ఈసారి పకడ్బందీ చర్యలు చేపడతామన్నారు. మ్యాచ్ ప్రారంభానికి ముందుగానే నిర్వాహకులు ప్రకటించిన సమయానికి ప్రేక్షకులు వస్తే ట్రాఫిక్ సమస్య ఉండదని, దానికి అనుగుణంగా చర్యలు తీసుకుంటామన్నారు. సామాన్యులకు టిక్కెట్లు అందేలా సరికొత్త ఆలోచనతో టికెట్స్ అమ్మకాలను డిస్‌ప్లేలో పెట్టి అమ్మకాలను నిర్వహిస్తామన్నారు. జివిఎంసి కమిషనర్ రాజాబాబు మాట్లాడుతూ తాగునీరు, పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా జివిఎంసి ద్వారా అవసరమైన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ఈ సందర్భంగా అధికారుల బృందం, ఎసిఎ ప్రతినిధులు స్టేడియం పక్కనే ఉన్న జాతీయరహదారిలో ట్రాఫిక్‌ను పరిశీలించి, ఎటువంటి చర్యలు చేపట్టాలనే అంశాలపై చర్చించారు.

జిల్లా స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌లో
శొంఠ్యాం విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి -ఆనందపురం: చిన వాల్తేర్ కెడిపిఎం హైస్కూల్‌లో ఈనెల 14 నిర్వహించిన జిల్లాస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచి, రాష్ట్రస్థాయికి ఎంపికైన శొంఠ్యాం హైస్కూల్ విద్యార్థులు, సంబంధిత ఉపాధ్యాయులను శుక్రవారం అభినందించారు. జిల్లాస్థాయి ఎగ్జిబిషన్‌లో పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు రెండు ప్రాజెక్టులు ప్రదర్శించగా, వాటిలో ఒకటి రాష్ట్ర పోటీలకు ఎంపికైంది. రాష్ట్రపోటీలకు ఎంపికైన విద్యార్థులు వై సాయి, జి.ప్రకాష్ పాల్‌లను హెచ్ఎం కె.వి. సుబ్బారావు, సైన్సు ఉపాధ్యాయులు సిహెచ్ నరసింహ, పి. జయశ్రీరాణి, వైసిపి లెంక రాంబాబు పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్, స్పైమార్వల్ ఆర్ట్స్ విశాఖపట్నం జిల్లా ఉపాధ్యక్షులు బొడ్డపు బంగార్రాజు అభినందించారు రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులకు. పి.జయశ్రీ రాణి . హిందీ టీచర్ పద్మ నగదు బహుమతి అందించారు. కార్యక్రమంలో బొడ్డపు సంతోష్.పాల్గొన్నారు

వైసిపి వైఫల్యాలే టిడిపి విజయసోపానాలు



మాట్లాడుతున్న కోరాడ రాజబాబు

ప్రజాశక్తి -తగరపువలస : పాలనలో వైసిపి ప్రభుత్వ వైఫల్యాలే రానున్న సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి విజయానికి దోహదపడతాయని భీమిలి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి కోరాడ రాజబాబు జోస్యం చెప్పారు. శుక్రవారం భీమిలి మండలం, టి నగరపాలెంలో టిడిపి ఆధ్వర్యంలో ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి నిరసన చేపట్టారు. జగన్‌రెడ్డి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై ఇంటింటా ప్రచారం చేశారు.కరపత్రాలు పంచిపెట్టారు. రచ్చబండ నిర్వహించి ప్రభుత్వ వైఫల్యాలను వివరించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, మండల పార్టీ అధ్యక్షులు డిఎవి రాజు, మాజీ సర్పంచ్ పొట్నూరు రాము, నాయకులు టి.రాము, చిట్టిబాబు, రెండో వార్డు అధ్యక్షులు బడిగింటి నీలకంఠం పాల్గొన్నారు.

అక్రమ వసూళ్లపై చర్యలు తీసుకోకుంటే
జివిఎంసి ముట్టడిస్తాం : టిడిపి

ప్రజాశక్తి- గాజువాక : జివిఎంసి గాజువాక జోన్ పరిధిలో టౌన్ ప్లానింగ్ అధికారుల అండతో అధికార వైసిపి నేతలు, కార్పొరేటర్లు భవన నిర్మాణదారులను బెదిరించి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని, దీనిపై తగు చర్యలు తీసుకోకుంటే జివిఎంసి కార్యాలయాన్ని ముట్టడిస్తామని గాజువాక నియోజకవర్గ టిడిపి సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్ హెచ్చరించారు. శుక్రవారం స్థానిక టిడిపి కార్యాలయంలో నిర్వహించిన పార్టీ సమావేశంలో మాట్లాడుతూ, జోన్ పరిధిలో జివిఎంసి ఆధ్వర్యంలో చేపడుతున్న కాలువలు, సిమెంట్ కాలువలు, ఇతర అభివృద్ధి పనులు నాసిరకంగా జరుగుతున్నాయని, దీనిపై ప్రధాన కమిషనర్ జోక్యం చేసుకుని ఎసిబి విచారణకు ఆదేశించాలని కోరారు. 65వ వార్డు అధ్యక్షులు రట్టి వాసు మాట్లాడుతూ 65వ వార్డులో కార్పొరేటర్ అక్రమ వసూళ్ళు, 86వ సర్వే నెంబరులో జరుగుతున్న భూఆక్రమణలు, భూదందాలను విజిలెన్స్ దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేశారు. దీనిపై అధికారులు స్పందించకుంటే జివిఎంసి వద్ద మహాధర్నా చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌ఛార్జి అంగ కృష్ణ, 65వ వార్డుతెలుగు యువత అధ్యక్షుడు కంచిపాటి అప్పలరాజు, గాజువాక నియోజకవర్గం బిసి సెల్ ప్రధాన కార్యదర్శి పోతిన వెంకటేశ్వరరావు, శివంగి నాగేశ్వరరావు రట్టి జయమ్మ, రట్టి సంతోష్ పాల్గొన్నారు

కార్మికుల సమస్యలపై నిర్లక్ష్యం

సిఐటియు ఆధ్వర్యాన రైల్వే వ్యాగన్ కంపెనీ వద్ద ధర్నా



సిఐటియు ఆధ్వర్యాన ధర్నా చేస్తున్న కార్మికులు

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక ఆటోనగర్ డి-బ్లాక్ రైల్వే వ్యాగన్ కంపెనీలో పనిచేస్తున్న కార్మికుల పట్ల యాజమాన్యంతోపాటు సంబంధిత కాంట్రాక్టర్లు తీవ్ర నిర్లక్ష్యం చూపుతున్నారని గాజువాక సిఐటియు నేత రాంబాబు విమర్శించారు. ఇటీవల విధి నిర్వహణలో ప్రమాదానికి గురైన గోపి అనే కార్మికునికి మెడికల్ బెనిఫిట్ కల్పించాలని కోరుతూ శుక్రవారం వ్యాగన్ కంపెనీ వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ ప్రమాదానికి గురైన కార్మికునికి నాలుగు నెలలైనా అటు యాజమాన్యం గానీ, ఇటు కాంట్రాక్టర్ గానీ ఎటువంటి మెడికల్ బెనిఫిట్స్, వేతనం ఇవ్వకుండా ఇబ్బంది పెట్టడం దుర్మార్గమన్నారు. కార్మికుల సమస్యలు యాజమాన్యానికి తెలియనీయకుండా విభజించి పాలించు విధానాన్ని అవలంబిస్తూ 15మంది చొప్పున కార్మికులకు ఒక కాంట్రాక్టర్‌ను నియమించి చెల్లాచెదురుచేస్తున్నారని దుయ్యబట్టారు. విధి నిర్వహణలో ప్రమాదానికి గురైన కార్మికులకు మెడికల్ బెనిఫిట్స్ ఇవ్వకపోవడం, రెండు రోజులు సెలవు పెడితే విధుల నుంచి తొలగించడం, ఇఎస్ఐ, పిఎఫ్, ఇతర కార్మిక నిబంధనలకు లోబడి కల్పించాల్సిన సౌకర్యాలు లేకుండా చేయడం వంటి చర్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు. ఇప్పటికైనా రైల్వే వ్యాగన్ కంపెనీ యాజమాన్యం స్పందించి తగు చర్యలు చేపట్టి, కార్మికులకు న్యాయం చేయాలని లేకుంటే తీవ్రస్థాయిలో ఆందోళన తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆటోనగర్ సిఐటియు కార్యదర్శి డి.రమణ, గాజువాక సిఐటియు కార్యదర్శి లోకేష్, అప్పారావు, అవతారం రామకృష్ణ, గోపి, కార్మికులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న ఆర్‌జెడి జ్యోతికుమారి

ప్రజాశక్తి -భీమునిపట్నం : క్రీడలతో మానసికోల్లాసం, శారీరక దారుఢ్యం పెరుగుతుందని విద్యాశాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ ఎం జ్యోతికుమారి విద్యార్థులకు సూచించారు. శుక్ర వారం స్థానిక సెయింట్ ఆన్స్ ఎయిడెడ్ పాఠశాల క్రీడామైదానంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 14ఏళ్ల లోపు బాలబాలికలకు రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలను డిఇఒ ఎల్ చంద్రకళ, సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ బి శ్రీనివాసరావు, విశాఖ అర్బన్ ఉప విద్యాశాఖాధికారి ఎ.గౌరీశంకరరావుతో కలిసి జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. అనంతరం జాతీయ పతాకాన్ని ఆర్‌జెడి, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడా పతాకాన్ని డిఇఒ చంద్రకళ ఆవిష్కరించారు. జిల్లాల వారీగా క్రీడాకారుల గౌరవ వందనాన్ని స్వీకరించారు క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ సిహెచ్ వెంకట రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంఇఒ కె.ఎ బాలామణి, హెచ్ఎం తిరుమల శ్రీదేవి, సెయింట్ ఆన్స్ పాఠశాల కోఆర్డినేటర్ సిస్టర్ ట్రెసా మేరీ, పిఇటి అసోసియేషన్ విశాఖ, అనకాపల్లి జిల్లాల అధ్యక్షులు కె సతీష్, కెఎం నాయుడు, అనకాపల్లి జిల్లా ఎస్‌జిఎఫ్ కార్యదర్శి ఆళ్ళ శేఖర్, ఖోఖో అసోసియేషన్ విశాఖ, అనకాపల్లి జిల్లాల కార్యదర్శులు ఎల్ఎం శ్రీనివాసరావు, బి కిరణ్ కుమార్ పాల్గొన్నారు .మూడు రోజులపాటు జరగనున్న పోటీల్లో భాగంగా ప్రారంభ మ్యాచ్‌లో శ్రీకాకుళం, ప్రకాశం జిల్లాల బాలికలు తలపడ్డారు.

నేడు మహా అన్నసమారాధన

ప్రజాశక్తి -గోపాలపట్నం : మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని, 88వ వార్డు నరవలోని13వ శతాబ్దం నాటి శ్రీ ఉమా నాగలింగేశ్వర స్వయంభూ దేవాలయంలో మహా అన్నదానం నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త గండ్రెడ్డి దేవుడు ఆలయ కమిటీ తెలిపింది. ఎన్నో విశిష్టతలు కల మహిమాన్వితమైన ఉమా నాగలింగేశ్వర స్వామిని దర్శించుకుని, మొక్కులు తీర్చుకునేందుకు తరలివచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అవసరమైన ఏర్పాట్లు చేశామన్నారు.

రక్షణ గోడ నిర్మాణ పనులు అడ్డగింత

ప్రజాశక్తి - ఆరిలోవ : సింహాచలం దేవస్థానం భూముల పరిరక్షణ పేరుతో ఇటీవల ఎంపి నిధులతో నిర్మిస్తున్న రక్షణ గోడ పనులను హనుమంతువాక కొండవాలు ప్రాంతాల స్థానికులు శుక్రవారం అడ్డుకున్నారు. కొన్నాళ్లుగా కొండచుట్టూ రక్షణ గోడ నిర్మాణం చేస్తుండగా, హనుమంతువాక, సింహగిరి కాలనీల్లో దేవస్థానం భూముల్లో నివాసం ఉంటున్న స్థానికులు హుదూద్ తుఫాన్ సమయంలో కూలిపోయిన తమ ఇళ్లను ఆర్థికస్థోమత లేక నిర్మించుకోలేక పోయామని, దీంతో ఖాళీగా ఉన్న ఆ జాగాలను కలిపేసుకుని రక్షణ గోడ నిర్మాణం చేపట్టడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. గతంలో తాము నివాసమున్న ఇళ్లస్థలాలను వదిలి గోడ నిర్మాణం చేపట్టాలని దేవస్థానం సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. దీంతో దేవస్థానం భూపరిరక్షణ విభాగం సూపరింటెండెంట్ ప్రసాద్, ఇతర అధికారులు అక్కడకు చేరుకొని నిర్మాణ పనులను పరిశీలించారు. ఇక్కడ తమ స్థలాలు ఉన్నాయని రికార్డులతో కూడి ఆధారాలు చూపిస్తే వాటిని మినహాయించి గోడ నిర్మాణం చేపడతామని హామీ ఇవ్వడంతో గొడవ సద్దుమణిగింది.

కమ్యూనిటీ హాల్ సమస్య పరిష్కరిస్తా



సమస్యలను అడిగి తెలుసుకుంటున్న కెకె.రాజు

ప్రజాశక్తి -కంచరపాలెం : 53వ వార్డు శివనగర్ తదితర ప్రాంతాల్లో వార్డు కార్పొరేటర్ బర్కత్ ఆలీతో కలిసి విశాఖ ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త, నెడ్‌క్యాప్ చైర్మన్ కెకె.రాజు శుక్రవారం పర్యటించారు. వార్డు పరిధిలోని శివనగర్ ప్రజలు కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నెలకొన్న సమస్యలను విన్నవించగా, పరిష్కారానికిచర్యలు తీసుకుంటానని రాజు హామీనిచ్చారు. కార్యక్రమంలో 53వ వార్డు వైసిపి అధ్యక్షులు గుజ్జు వెంకటరెడ్డి, నేతలు షేక్ బాబ్జీ, మారే ఝాన్సీ, సదరం జ్ఞానేష్, కనకరాజు, హనుమంత్, జ్యోత్స్న, షేక్ నబీ, సూర్య పాల్గొన్నారు.

శ్రీవారికి పట్టు వస్త్రాల సమర్పణ

ప్రజాశక్తి -మధురవాడ : రుషికొండలోని మహాలక్ష్మి గోదాదేవి సహిత వెంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం శ్రీవారాభిషేకం వైభవంగా నిర్వహించారు. శ్రీవారిని ప్రత్యేకంగా అలంకరించేందుకు మంగళ వాయిద్యాల నడుమ టిటిడి అర్చకులు పట్టు వస్త్రాలు తీసుకొచ్చారు. అభిషేకం, పుష్ప నివేదన సమర్పించి శ్రీవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు.

ఉపాధ్యాయులపై వేధింపులు తగవు

- ★ సిపిఎస్ రద్దు చేయాలి
- ★ యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు శ్రీలక్ష్మి
- ★ మండల నూతన కార్యవర్గం ఎన్నిక



ప్రమాణ స్వీకారం చేస్తున్న యుటిఎఫ్ మండల కార్యవర్గ సభ్యులు

ప్రజాశక్తి-అచ్యుతాపురం

ఇటీవల ఉపాధ్యాయులపై అధికారులు చేస్తున్న అనేక రూపాల్లో వేధిస్తున్నారని, ఇది సరైన పద్ధతి కాదని ఆంధ్ర ప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) జిల్లా అధ్యక్షులు వత్సవాయి శ్రీలక్ష్మి అన్నారు. చిన్న చిన్న కారణాలు చూపిస్తూ ఉపాధ్యాయులకు అకారణంగా షోకాజ్ నోటీసులు, సస్పెండ్ ఉత్తర్వులు ఇవ్వడం మంచి పద్ధతి కాదని హితవుపలికారు. యుటిఎఫ్ అచ్యుతాపురం మండల శాఖ ప్రధాన కార్యదర్శి సబ్బారపు నూకరాజు అధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సమావేశం జరిగింది. ఇందులో పాల్గొన్న శ్రీలక్ష్మి మాట్లాడుతూ పాదయాత్రలో వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు సిపిఎస్‌ను రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, ప్రతినెల ఒకటవ తేదీన ఉద్యోగ, ఉపాధ్యాయుల జీతాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

మండల నూతన కార్యవర్గం ఎన్నిక

అనంతరం శ్రీలక్ష్మి, ఎన్నిక పరిశీలనకులు జిఎస్ ప్రకాష్ సమక్షంలో యుటిఎఫ్ మండల నూతన కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. మండల శాఖ నూతన గౌరవాధ్యక్షులుగా కె.సుభాషిణిదేవి, అధ్యక్షులుగా కె.మురళీకృష్ణ, సహ అధ్యక్షులుగా పైడిరాజు, సూర్యలక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా సబ్బారపు నూకరాజు, కోశాధికారిగా బికె.మహిమరావు ఎన్నికయ్యారు. జిల్లా కౌన్సిలర్స్‌గా వత్సవాయి శ్రీలక్ష్మి, కృష్ణవేణి, రేబాక రవికుమార్, గుత్తలు సూర్యప్రకాష్, మహిళా కన్వీనర్‌గా అరుణకుమారి, మండల కౌన్సిలర్స్‌గా లావణ్య, కుమారి, సిపిఎస్ కన్వీనర్‌గా సలీం, అకడమిక్ కన్వీనర్‌గా సత్యనారాయణ, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా ఎస్తేరు రాణి, సోషల్ మీడియాలికు రేఖ తదితరులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.మురళీకృష్ణ, సబ్బారపు నూకరాజు మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని చెప్పారు.



పంపిణీ చేసిన స్టడీ మెటీరియల్‌ను చూపుతున్న విద్యార్థులు

'అమ్మ' ఆధ్వర్యాన టెన్త్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్

ప్రజాశక్తి -కె.కోటపాడు

మండలంలోని కొరువాడ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 10వ తరగతి విద్యార్థులకు అమ్మ చారిటబుల్ ట్రస్టు, 1993-94 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆధ్వర్యంలో శుక్రవారం స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.కమల కుమారి, ఉపాధ్యాయులు, ట్రస్ట్ బోర్డు సభ్యులు 36 మంది విద్యార్థులు ఈ స్టడీ మెటీరియల్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ గొంప వెంకట రావు మాట్లాడుతూ విద్యార్థులు ప్రణాళికా బద్ధంగా కష్టపడి చదవాలని సూచించారు. ట్రస్ట్ వైస్ చైర్మన్ సింగంపల్లి అర్జున మాట్లాడుతూ ఉపాధ్యాయులు, విద్యార్థులు ఐక్యంగా కృషి చేసి పది పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని కోరారు. హెడ్‌ఎం, ఉపాధ్యాయులు అమ్మ చారిటబుల్ ట్రస్ట్ చేస్తున్న సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు సింగంపల్లి శంకరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

టెన్త్ సిబిఎస్ఇ విద్యార్థులకు వీడ్కోలు

ప్రజాశక్తి- కశింకోట

కశింకోట సెయింట్ జాన్స్‌లో పదవ తరగతి సిబిఎస్ఇ విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం శనివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా స్కూల్ డైరెక్టర్ బత్తుల నోబెల్ కుమార్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చదువుతో పాటు ఆటలు పాటల్లోనూ రాణించాలన్నారు. మంచి భవిష్యత్తు కోసం ఉన్నత చదువుపై దృష్టి పెట్టాలని సూచించారు. మంచి మార్గంలో ఉండి సమాజంలో గౌరవం తెచ్చుకోవాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ బత్తుల అనురాధ, అకాడమిక్ ఇన్‌ఛార్జి రూపానంద్, ప్రిన్సిపాల్ మహేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ ఆర్థిక క్రమశిక్షణ అవసరం



2కె రన్‌ను ప్రారంభిస్తున్న బ్యాంకుల అధికారులు

ప్రజాశక్తి- అనకాపల్లి

ప్రతి ఒక్కరూ ఆర్థిక క్రమశిక్షణ అలవర్చుకోవాలని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డివిజనల్ హెడ్ నటరాజన్, జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ సత్యనారాయణ అన్నారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 2023 సంవత్సరం ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలు సందర్భంగా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్, ఎస్బిఐ ఆధ్వర్యంలో శుక్రవారం భాష్యం స్కూల్ విద్యార్థులతో కలిసి 2కే రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డబ్బును సక్రమంగా నిర్వహించుకునే ప్రవర్తన, సురక్షితమైన పొదుపు మార్గాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. బ్యాంకుల ఆర్థిక లావాదేవీలు పట్ల ప్రతి ఖాతాదారుడు అవగాహన కలిగి ఉండాలన్నారు. డిజిటల్ బ్యాంకింగ్ సాంకేతికతపై నైపుణ్యం పెంచుకోవాలని సూచించారు. మోసపూరిత సందేశాలు, వ్యక్తుల ఫోన్ సంభాషణపై అప్రమత్తత కలిగి ఉండాలన్నారు. నగదు రహిత లావాదేవీలపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి సారించాయని, రూపే కార్డు, ఇంటర్నెట్ బ్యాంకింగ్ వాడకం, క్యూఆర్ కోడ్ ద్వారా నగదురహిత లావాదేవీలు పెరగాలని తెలిపారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు 2 పోలింగ్ కేంద్రాలు

ప్రజాశక్తి- కె.కోటపాడు

మార్చి 13న జరగనున్న ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు కె.కోటపాడులో రెండు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తహశీల్దార్ రమేష్ బాబు తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక జెడ్పీ హైస్కూల్లో రెండు పోలింగ్ కేంద్రాల గదులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలో పట్టభద్రుల ఓటర్లు 1600 వరకు నమోదు చేసుకున్నారని, ఇందులో పురుషులు 985 మంది, మహిళలు సుమారు 600 మంది ఉన్నారని తెలిపారు. గ్రామాల్లో రాజకీయ పార్టీల ఫ్లెక్సీ బోర్డులు తొలగిస్తున్నామని, నాయకుల విగ్రహాలకు ముసుగులు తొడిగిస్తామని చెప్పారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

ప్రజాశక్తి-అనకాపల్లి

ప్రకృతి వ్యవసాయం పట్ల రైతులు అవగాహన పెంచుకోవాలని కుంచంగి గ్రామ సర్పంచ్ రొంగలి అప్పలనాయుడు అన్నారు. అనకాపల్లి జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం గ్రామంలో ఏపీ కమ్యూనిటీ మేనేజ్డ్ ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం వల్ల నాణ్యమైన పంటలు ఉత్పత్తి అవుతాయన్నారు. వీటివల్ల ప్రజలకు ఆరోగ్యకరమైన ఆహార పంటలు లభ్యం అవుతాయని తెలిపారు. అనంతరం గ్రామంలో మానవహారంగా ఏర్పడి ప్రకృతి వ్యవసాయం పట్ల నినాదాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు వర్మ రాజు, సిఎన్ఎఫ్ సిబ్బంది శ్రీనివాస్, వెంకటరమణ, సత్యారావు, నాగేశ్వరరావు, ఐసిఆర్‌పిలు, అంగన్వాడీలు, రైతు భరోసా సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



మానవహారం చూస్తున్న విద్యార్థులు, వివిధ శాఖల సిబ్బంది

ప్రతి ఇంటికీ వెళ్లాలి

మంత్రి గుడివాడ అమరనాథ్

ప్రజాశక్తి - కశింకోట

గృహ సారథులు ప్రతి ఇంటికి వెళ్లి వారి సమస్యలను తెలుసుకోవాలని రాష్ట్ర పరిశ్రమలశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. కశింకోట నారాయణ మూర్తి కళ్యాణ మండపంలోనూ, బయ్యవరం ఎస్ఆర్ గార్డెన్‌లోనూ శుక్రవారం 'మా నమ్మకం నువ్వే జగనన్న' కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో 65 లక్షల మందికి పింఛన్లు ఇస్తున్నామన్నారు. వైసిపి ప్రభుత్వం చేసిన అభివృద్ధిని చూడలేక టిడిపి బురదజల్లే కార్యక్రమం చేపడుతుందని ఆరోపించారు. గతంలో తెలుగుదేశం పార్టీ చేసిన మోసాలను ప్రజలకు తెలియజేయాలని పిలుపునిచ్చారు ప్రతి ఇంటికీ వెళ్లి వారి అనుమతితో వారి ఇంటి డోర్‌పై స్టిక్కర్ అంటించాలని సూచించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఐదున్నర లక్షల మంది రథసారథులు ఉన్నారని తెలిపారు. మార్చి నెల పెన్షన్లకు వాలంటీర్లతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు కూడా వెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కలగా లక్ష్మి, జడ్పిటిసి దంతలూరి దంతులూరి శ్రీధర్‌రాజు, సర్పంచ్‌లు కలగా గున్నయ్య నాయుడు, మంత్రి జయ రజిని, వైపిపి నాయకులు మల్ల బుల్లి బాబు, గొల్లవిల్లి శ్రీనివాసరావు, మలసాల కిషోర్, పలకా రవి, అనకాపల్లి ఎంపీపీ గొర్లి సూరిబాబు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కరకా సోమనాయుడు, వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి నమ్మి మీనా, నీటిపల్లి లక్ష్మి, పెంటకోట శ్రీనివాసరావు, నమ్మి గణేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్‌నాథ్

మదర్ ఛారిటబుల్ ట్రస్టు సేవలు అభినందనీయం

ప్రజాశక్తి-సబ్బవరం

స్థానిక మదర్ చారిటబుల్ ట్రస్ట్ చేస్తున్న సేవలు అభినందనీయమని టెక్కలిపాలెం గ్రామానికి చెందిన గొంప వెంకటరమణ (సౌత్ ఆఫ్రికా) అన్నారు. శుక్రవారం ఆయన మదర్ ట్రస్టు కార్యాలయాన్ని సందర్శించారు. ట్రస్ట్ ద్వారా చేస్తున్న సేవా కార్యక్రమాలను తెలుసుకున్నారు. ట్రస్టు సొంత భవన నిర్మాణాన్ని పరిశీలించి, దానికి తన వంతు సహాయం చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ట్రస్ట్ ద్వారా ఉచిత కుట్టు శిక్షణ పొందిన యువతులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో సబ్బవరం సర్పంచ్ దేడ్డం ప్రసాదరావు, టెక్కలి పాలెం మాజీ ఎంపిటిసి పైలా వెంకటరమణ, మాజీ సర్పంచ్ పంచాడ శ్రీను, సంస్థ చైర్మన్ డాక్టర్ వి.సత్య గంగరాజు, డైరెక్టర్ పి శ్రీనివాసరావు, టి.తారకేశ్వరి, జి.రమేష్, మౌనిక, సత్య, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



కుట్టు శిక్షణ సర్టిఫికెట్లు అందజేస్తున్న వెంకటరమణ తదితరులు



విద్యార్థికి మందులు అందజేస్తున్న వైద్యులు

'మైహోం' ఆధ్వర్యాన ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-యలమంచిలి రూరల్

మండలంలో ములకలపల్లి మైహోం ఇండస్ట్రీస్ ఆధ్వర్యంలో శుక్రవారం పులపర్తి, లక్కవరం, గుండ్రిబిల్లి గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించారు. వైద్య, నేత్ర పరీక్షలు ఉచితంగా చేసి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సాంబమూర్తి, ప్రియా, నరేష్ కుమార్, ఎల్వి ప్రసాద్ కంటి ఆసుపత్రి వైద్యులు, ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఫ్యాక్టరీ జిఎం బి.రామస్వామి, సీనియర్ డిజిఎం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నేడు దేముళ్లమ్మ పేరంటాలు తీర్థం

ప్రజాశక్తి-దేవరాపల్లి

దేవరాపల్లి రింగువాలు దగ్గరలో ఉన్న వడి చింతల కళ్లాల వద్ద శనివారం దేముళ్ళమ్మ పేరంటాల తీర్థ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం 8 గంటలకే జిల్లా స్థాయి ఎడ్ల పరుగు పందెం నిర్వహించి విజేతలకు రూ.10 వేలు, రూ.8 వేలు, రూ.7 వేలు, రూ.6 వేలు, రూ.5 వేలు, రూ.4 వేలు, రూ.3 వేలు, రూ.2వేలు చొప్పున బహుమతులు అందజేయడం జరుగుతుందని తెలిపారు. బహుమతి లేని బళ్లకు ప్రయాణ ఖర్చుల నిమిత్తం వెయ్యి రూపాయలు అందజేయనున్నట్లు వెల్లడించారు. మధ్యాహ్నం 12 గంటలకు అమ్మవారి గుడి దగ్గర భారీ అన్నసంతర్పణ జరుగుతుందని, సాయంత్రం నాలుగు గంటల నుండి డ్యాన్స్ బేబీ డ్యాన్స్ కార్యక్రమం, వివిధ సాంస్కృతి కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ఘనంగా దుర్గాదేవి జాతర

ప్రజాశక్తి- అనకాపల్లి

మండలంలోని మామిడిపాలెం గ్రామంలో శుక్రవారం దుర్గాదేవి జాతర మహోత్సవం ఘనంగా జరిగింది. ఆలయ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో మహిళలకు ముగ్గుల పోటీలు, ఎడ్ల పందాలు, స్లో సైకిల్ వంటి క్రీడలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో అమ్మవారి సారే ఊరేగింపు ఘనంగా జరిగింది. భక్తులు ఉదయం నుంచి ఆలయానికి చేరుకొని మొక్కులు, ముడుపులు తీర్చుకున్నారు.




సారె ఊరేగిస్తున్న మహిళలు

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతులు

ప్రజాశక్తి బుచ్చయ్యపేట

రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా అభివృద్ధి చేస్తూ మెరుగైన వసతులు కల్పిందని మండల విద్యాశాఖాదికారి చంద్రశేఖర్ అన్నారు. వాటిని పేద విద్యార్థులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శుక్రవారం బుచ్చయ్యపేటలో వివోఏలకు, వైయస్సార్ క్రాంతి పథం సిబ్బందికి విద్యాలయాల్లో నాడు-నేడు లక్ష్యాల గురించి వివరించారు. తొలి, మలి విడతల్లో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లోనూ మౌలిక వసతులను పెంపొందించామని చెప్పారు. పిల్లలు మధ్యలో బడి మానేయకుండా చూడాలని కోరారు.



మాట్లాడుతున్న ఎంఇఒ చంద్రశేఖర్

సంక్షేమ వసతి గృహాల్లో తనిఖీలు

ప్రజాశక్తి - పరవాడ

కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలోని పలు ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో శుక్రవారం అధికారులు విస్తృతంగా తనిఖీలు చేశారు. పరవాడతో పాటు మండలంలోని 7 హాస్టళ్లను మండల ప్రత్యేకాధికారి కె.వీరన్ననాయుడు, ఎంపీడీవో హేమ సుందర్‌రావు సందర్శించారు. పరవాడ, లంకెలపాలెం, తానాం, వాడచీపురపల్లి బిసి బాలుర వసతి గృహాలు, తానాం ఎంజెపి ఏపిబిసిడబ్ల్యూఆర్ బాలికల స్కూల్, కాలేజీ, వాడచీపురపల్లి జిఎస్‌డబ్ల్యూ బాయ్స్ హాస్టల్, పరవాడ జిఎస్‌డబ్ల్యూ గర్ల్స్ హాస్టల్ తదితర వసతి గృహాల్లో తనిఖీలు చేశారు. విద్యుత్, తాగునీరు, టాయిలెట్స్ పరిశీలించారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను తెలుసుకున్నారు. ఈ నివేదికలను జిల్లా కలెక్టర్‌కు ఇవ్వనున్నట్లు ఎంపిడిఒ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ సునీత తదితరులు పాల్గొన్నారు. ఏడబ్ల్యుఎస్, మండల ఇంజనీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



దేవరాపల్లిలో స్టోర్ రూమ్‌లో సరుకుల వివరాలు తెలుసుకుంటున్న అధికారులు

దేవరాపల్లి : మండలంలోని తెనుగుపూడి అంబేద్కర్ గురుకుల పాఠశాల, బేతపూడిలోని కస్తూరిబా గాంధీ విద్యాలయం, దేవరాపల్లిలోని బీసీ బాలుర హాస్టల్‌ను మండల ప్రత్యేక అధికారి వి. రవీంద్రనాథ్, ఎంపీడీవో సిహెచ్ సుబ్బలక్ష్మి, ఈవోపిఆర్‌డి ఉషశ్రీ శుక్రవారం తనిఖీలు చేశారు. హాస్టల్లో ఉన్న విద్యార్థుల బాగోగులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు సమస్యలపై నిర్లక్ష్యం చేయకుండా తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు గురుకుల పాఠశాలలో సమస్యలు గుర్తించారు. హాస్టల్ స్టోర్ రూమ్‌లో సరుకులు నాణ్యతను పరిశీలించి రికార్డులు తనిఖీ చేశారు. గుర్తించిన సమస్యలను ఉన్నతాధికారులు దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం చూపిస్తామని ప్రత్యేక అధికారి తెలిపారు.

110వ రోజుకు నేవీ నిర్వాసితుల ఆందోళన



నిర్వాసిత జెఎసి పెద్దలతో మాట్లాడుతున్న డిఎస్‌పి శ్రీనివాస్

ప్రజాశక్తి-రాంబిల్లి

తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మండలంలోని వాడనర్సాపురం వద్ద ఎన్ఎఒబి ప్రధాన గేట్ ముందు నేవీ నిర్వాసితులు చేపట్టిన ఆందోళన శుక్రవారం నాటికి 110వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా నిర్వాసిత జెఎసి పెద్దలు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించడంలో తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నాయని విమర్శించారు. నేవల్ బేస్ వస్తే తమకు గతం కంటే మెరుగైన ఉపాధి, మంచి జీవితం ఉంటుందని అనుకుంటే, అది రాకపోగా, మరింత దుర్భర జీవనం అనుభవించాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. 110 రోజులుగా రోడ్లపై బైఠాయించినా, అధికారులు, రాజకీయ నాయకులు చుట్టూ తిరిగినా, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ పెద్దలను కలిసిన తమకు న్యాయం జరగలేదని వాపోయారు. ఇది ఇలా ఉండగా, శుక్రవారం శిబిరాన్ని సందర్శించిన డిఎస్‌పి శ్రీనివాస్ సోమవారం నాటికి నేవీ నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి జిల్లా అధికార యంత్రాంగం మినిట్స్ రూపొందించి మీ ముందుకు వస్తారని తెలిపారు. దీనికి స్పందించిన నిర్వాసిత పెద్దలు మాట్లాడుతూ, మినిట్స్‌లో జిల్లా అధికార యంత్రాంగం ఏమి పొందుపరిచారో చూశాకే తమ నిర్ణయాన్ని తెలుపుతామని తేల్చి చెప్పారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో నిర్వాసితులు పాల్గొన్నారు.

పద్మలింగేశ్వరస్వామి కల్యాణోత్సవాల పోస్టరు ఆవిష్కరణ

ప్రజాశక్తి-వడ్డాది

బుచ్చయ్యపేట మండలంలోని వడ్డాది కొత్తూరులో ఉన్న పద్మ లింగేశ్వరస్వామి వార్షిక కల్యాణ మహోత్సవానికి సంబంధించిన పోస్టర్‌ను ఆలయ ప్రాంగణంలో జిల్లా జెడ్పిటిసిల ఫోరం అధ్యక్షుడు దొండా రాంబాబు, పలువురు గ్రామ పెద్దలు ఆవిష్కరించారు. శనివారం కల్యాణోత్సవంతో పాటు మహాశివరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. కల్యాణోత్సవం సందర్భంగా ముగ్గుల పోటీలు, పిడతల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేయనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. శనివారం మధ్యాహ్నం భక్తులకు అన్న సమారాధన ఏర్పాటు చేశామన్నారు. ఉదయం నుండి స్వామివారికి ప్రత్యేక పూజలు జరుగుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ దాడి సూర్య నాగేశ్వరరావు, టిడిపి గ్రామ అధ్యక్షుడు దొండా నరేష్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

శివరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు

ప్రజాశక్తి- కె.కోటపాడు

మండల కేంద్రంలో భీమలింగేశ్వర స్వామి మాణిక్యాంబ దేవాలయంలో మహాశివరాత్రి ఉత్సవాలకు ఎంపీపీ రెడ్డి జగన్మోహన్ ఆధ్వర్యాన ఘనంగా ఏర్పాట్లు చేశారు. శనివారం ఉదయం 5 గంటల నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించడానికి ఆలయాన్ని ముస్తాబు చేశారు. రాత్రి తొమ్మిది గంటలకు సాయిబాబా ఆలయ పురోహితులు గోరు గొంతు రమేష్ ఆధ్వర్యంలో రుద్రాభిషేకాలు నిర్వహించనున్నారు. కె. కోటపాడు ఉపసర్పంచ్ రెడ్డి అరుణ ఆధ్వర్యంలో శనివారం మధ్యాహ్నం 12 గంటల నుండి భారీ అన్న సమారాధన జరిపేందుకు ఏర్పాటు చేశారు.

బుచ్చయ్యపేట : మహాశివరాత్రి సందర్భంగా మండలంలోని పలు శివాలయాల్లో ఉత్సవాలకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. మండలంలోని వడ్డాది, దిబ్బిడి, బుచ్చయ్యపేట, నీలకంఠాపురం, రాజాం, గున్నెంపూడి, సీతయ్యపేట, పెదపూడి, పంగిడి తదితర గ్రామాల్లోని ఆలయాలకు రంగుల వేసి అలంకరణలు చేశారు.



ముస్తాబైన కె.కోటపాడు శివాలయం



వృద్ధునికి కరపత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే పీలా

వైసిపి పాలనలో పంచాయతీ వ్యవస్థ నిర్వీర్యం

ప్రజాశక్తి - కశింకోట

వైసిపి ప్రభుత్వ పాలనలో పంచాయితీ వ్యవస్థ నిర్వీర్యమవుతుందని మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ ఆరోపించారు. మండలంలోని పరవాడపాలెం గ్రామంలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర



వినతిపత్రం ఇస్తున్న ఎపిటిఎఫ్ నాయకులు

హామీల అమలుకు ఎపిటిఎఫ్ వినతి

ప్రజాశక్తి-అనకాపల్లి

ఉపాధ్యాయులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ ఎపిటిఎఫ్ నాయకులు శుక్రవారం తహశీల్దారు గంగాధర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ ప్రతి నెల ఒకటో తేదీన జీతాలు చెల్లించాలని, సిపిఎస్‌ను రద్దు చేయాలని, పీఎఫ్, ఈఎల్ బకాయిలు, పెండింగ్ డిఏలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎపిటిఎఫ్ మండల అధ్యక్షులు కెవిఎల్ గణేష్, ప్రధాన కార్యదర్శి డి నూకేష్, నాయకులు నరసయ్య నాయుడు, కన్నారావు, రామకృష్ణ, ప్రసాద్, ప్రకాష్ పాల్గొన్నారు.

గ్రామీణ సమస్యలపై వినతి

ప్రజాశక్తి-అనకాపల్లి

గ్రామాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు నివసించే కాలనీలో మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారించాలని కోరుతూ శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో నేషనల్ ఫోరం ఫర్ సోషల్ జస్టిస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సూదికొండ మాణిక్యాలరావు ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. పారిశుధ్య పరిస్థితులు అధ్వానంగా ఉన్నాయని, డ్రైనేజీలు లేకపోవడంతో మురుగనీరు రోడ్లపైనే ప్రవహిస్తోందని తెలిపారు. విద్యుత్ సదుపాయం లేక రాత్రి సమయాల్లో ఇబ్బందులు పడుతున్నారని, కుక్కలు పందులు పెడుతూ ప్రజలు బెంబేలెత్తుతున్నారని పేర్కొన్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో ఫోరం జిల్లా అధ్యక్షులు కొల్లి చిన్న అప్పారావు ఉన్నారు.

స్థానిక సమస్యలను పరిష్కరిస్తాం

ప్రజాశక్తి-అనకాపల్లి

మండలంలోని మేజర్ పంచాయతీ తుమ్మపాల గ్రామం నాలుగు, ఐదు వార్డుల్లో నెలకొన్న పైప్ లైన్ లీకేజీ సమస్య, డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలని వార్డు మెంబర్లు సందిన సునీల్, పట్నాల విజయ తెలియజేయడంతో గ్రామ సర్పంచ్ తట్ట పెంటయ్య నాయుడు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో శుక్రవారం ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ నాగేశ్వరరావు, ఏఈ శ్రీనివాసరావు పరిశీలించి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వార్డు మెంబర్ రవ్వ శ్రీను, ఇంజనీరింగ్ అసిస్టెంట్ ఉమా, వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



పంచాయతీ పాలకవర్గంతో మాట్లాడుతున్న అధికారులు

శివరాత్రి ఉత్సవాలకు సిద్ధం



గొలుగొండ మండలంలో ముస్తాబైన ఆలయం

-ముస్తాబైన ఆలయాలు - ఏర్పాట్లు పరిశీలించిన అధికారులు, నిర్వాహకులు



ఏర్పాట్లు పరిశీలిస్తున్న అధికారులు

ప్రజాశక్తి -కొత్తకోట:రావికమతం మండలం కల్యాణపు లోవలో ఈ నెల 18వ తేదీ నుంచి మూడు రోజులపాటు జరిగే మహా శివరాత్రి తిరునాళ్లకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు దేవాదాయ ధర్మాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ ఎన్.సుజాత తెలిపారు. శుక్రవారం ఆమె కల్యాణపోతురాజుబాబు, పెద్దింటమ్మ ఆలయాలను పరిశీలించి ఏర్పాట్లపై ఆరా తీశారు. స్నాన ఘట్టాల వద్ద భద్రతా ఏర్పాట్లు పరిశీలించారు. మహిళా భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ఆలయాల వద్ద క్యూ లైన్, అన్న సమారాధన, ప్రసాదం విక్రయాలు, తలనీలాలు సమర్పణలో భక్తుల తాకిడి లేకుండా చూడాలని దేవాదాయ శాఖ ఈవో మురళికృష్ణను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, తమ పరిధిలో సుమారు 43 దేవాలయాలలో మహాశివ రాత్రి ఉత్సవాలు జరుగుతుండటంతో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని సుజాత పేర్కొన్నారు.

రోలుగుంట:మండలంలోని కుసర్లపూడి గ్రామంలో మహాశివరాత్రిని పురస్కరించుకొని 18న శ్రీరామలింగేశ్వర శివాలయం, పాకలపాడు గురువు ఆశ్రమం వద్ద హరిభజన సంకీర్తన పోటీలు నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, 18న రాత్రి రుద్రాభిషేకం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భజన బృందం పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులను ఇవ్వనున్నట్లు తెలిపారు. మొదటి బహుమతి రూ.10వేలు, రెండవ బహుమతి రూ.5వేలు, మూడవ బహుమతి రూ.3వేలు, పాల్గొనేవారందరికి రవాణా ఖర్చులు రూ.1000 ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ముత్యాల వెంకటేశ్వరరావు (ఎంవిఆర్) రానున్నట్లు తెలిపారు.

ఉపమాక శివాలయం ముస్తాబు

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని ఉపమాక శివాలయంలో ఈనెల 18న శనివారం మహాశివరాత్రి కి సంబంధించి భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ చైర్మన్ చెరుకూరి వెంకటేశ్వరరావు తెలిపారు. మహాశివరాత్రి సందర్భంగా ఆలయానికి విద్యుద్దీకరణ చేపట్టారు. ఆలయంలో క్యూ లైన్లు ఏర్పాటు చేశారు. శనివారం తెల్లవారుజామున పరమేశ్వరుడికి తొలి అభిషేకం జరుగుతుందని, ఉదయం 6 గంటల నుంచి నవగ్రహ మందిరాల వద్ద తైలాభిషేకాలు, రాత్రి త్రినేత్రుడికి ప్రత్యేక అభిషేకాలు జరుగుతాయని ఆలయ అర్చకులు వెలవలపల్లి మహేష్, సంతోష్ తెలిపారు.

దారమఠంకు దాతల సహకారం

గొలుగొండ: దారమఠం ఉమాధారమల్లేశ్వరస్వామి ఆలయం ఎంతో పురాతన ప్రసిద్ధి చెందింది. ఏళ్ల తరబడి దారమఠం దిగవ భాగంలో వెలసి ఉన్న శివాలయం 19వ శతాబ్దంలో పూరిపాకలో ధారమల్లేశ్వరుడు పూజలు అందుకొనేవాడు. ఇక్కడికి చేరాలంటే కాలినడకే ఒకటే మార్గంగా ఉండేది. భక్తులు దేవాలయానికి వచ్చి స్నానం ఆచరించి దర్శనం అనంతరం ఇక్కడే వంటలు వండి వన భోజనాలు గావించి సాయంత్రం ఇళ్లకు బయలుదేరేవారు. 2001లో గొలుగొండ ఎస్‌బిహెచ్ శాఖ మేనేజర్‌గా వచ్చిన జోగారావు సుబ్రహ్మణ్యం ఆలయ స్థితిగతిని పరిశీలించి పెద్దలతో మాట్లాడి ఆలయ పున:నిర్మాణానికి స్థానిక నేతలతో కలిసి పూర్తి చేశారు. తదనంతర కాలంలో ఆలయానికి మార్గం తారురోడ్డుగా ఏర్పాటు చేయడంతో నిత్యం దారమఠంకు భక్తుల తాకిడి పెరిగింది. అప్పటి నుంచి దాతలు ముందుకు వచ్చి ఆలయ ప్రాంగణంలో ఒక్కొక్కటిగా నిర్మాణాలు పెరుగుతూ వచ్చాయి. ఇదే స్ఫూర్తితో రేంజ్ అధికారి పిట్ల అప్పారావు ఆలయం ఎదుట ధ్యానశివుని నిర్మాణం చేయించారు. దాతలు నాతిరెడ్డి వంశీ, ఉమా దంపతులు తమ సొంత నిధులతో జలపాతాలకు మెట్టు మార్గాన్ని నిర్మించారు. ప్రతీ ఏడాది భారీ అన్నసమారాధన ఏర్పాటు చేసి వచ్చిన భక్తులకు ప్రసాదాలు అందిస్తున్నారు. గత ఏడాది దాతల దగ్గర నుండి విరాళాలు సేకరించి బైల్స్, క్యూలైన్ నిర్మించారు. ఆర్టీసీ యాజమాన్యం మూడు రోజులపాటు 15 బస్సులను ఏర్పాటు చేశారు. ఎస్సై నారాయణరావు సిబ్బందితో గట్టి బందోబస్తు నిర్వహిస్తారు.

గొలుగొండ:మండలంలోని ఏఎల్‌పురం స్వయంభూ నీలకంఠేశ్వరస్వామి ఆలయం మహాశివరాత్రి ఉత్సవాలకు ముస్తాబవుతోంది. ఈ ఉత్సవాలకు గొలుగొండ, కొయ్యూరు మండలాల నుంచి భారీగా భక్తులు తరలి రానున్నారు. ఇక్కడి బొడ్డేరు గెడ్డ ఉత్తరవాహినిలో పవిత్ర స్నానాలు ఆచరించి అనంతరం స్వామిని దర్శించుకుంటారు.



సతీష్‌ను సన్మానిస్తున్న సర్పంచ్, అభిమానులు.

ముత్యాల సతీష్‌కు ఘన సత్కారం

ప్రజాశక్తి-రోలుగుంట:మండలంలో శరభవరం గ్రామంలో పోతురాజు బాబు పండగ మహోత్సవము సందర్భంగా ప్రముఖ వ్యాపారవేత్త ముత్యాల వెంకటేశ్వరరావు తనయుడు, ముత్యాల సతీష్ స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ముత్యాల సతీష్‌కు గ్రామ సర్పంచి చంద్ర ఆధ్వర్యంలో కోలాటాలు, తప్పెటగుళ్లతో భారీ ఎత్తున గ్రామస్తులు స్వాగతం తెలిపారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు. ముత్యాల సతీష్‌కు ఘనంగా సత్కరించి స్వామి వారి చిత్రపటం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంవిఆర్ యువసేన సభ్యులు, ఎంవిఆర్ అభిమానులు, గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



పరుగు పెడుతున్న ఎడ్లు

ఉత్సాహంగా ఎడ్ల బళ్ల పోటీలు

ప్రజాశక్తి-గొలుగొండ:మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని ఏఎల్‌పురం గ్రామంలో శుక్రవారం నిర్వహించిన ఎడ్ల బండ్ల పోటీలు ఉత్సాహంగా సాగాయి. ఈ పోటీల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన లింగంపేట, చోద్యం విజేతలకు రూ.6వేలు, రూ.5వేల నగదు బహుమతులను మాజీ జెడ్పిటిసి సిహెచ్.తారక వేణుగోపాల్ చేతుల మీదుగా అందజేశారు. మహాశివరాత్రి సందర్భంగా మూడు రోజులపాటు హరి భజన కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

హాస్టల్‌లో వైద్యశిబిరం

ప్రజాశక్తి-యస్.రాయవరం:మండలంలోని లింగరాజు పాలెం గ్రామంలో బీసీ బాలికల వెల్ఫేర్ హాస్టల్‌లో సర్వసిద్ధి పిహెచ్‌సి వైద్యాధికారి ఎస్.ఎస్. శక్తిప్రియ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు నిర్వహించినట్లు ఆరోగ్య విస్తరణాధికారులు టి.నాగేశ్వరరావు, బి.సత్యనారాయణ తెలిపారు.విద్యార్థులకు పలు వ్యాధులు, వాటి నివారణ పై అవగాహన కల్పించారు.డ్రై డే, డ్రై డే సందర్భంగా యాంటి లార్వా ఆపరేషన్ నిర్వహించామని హెల్త్ అసిస్టెంట్ బి.ప్రేమ్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ డి.రామలక్ష్మి, హెల్త్ అసిస్టెంట్ బి.ప్రేమ్‌కుమార్, సచివాలయం హెల్త్ సెక్రటరీ డి.బేబీ పాల్గొన్నారు.



సర్వే చేపడుతున్న సిబ్బంది

బోడపాలెంలో డ్రోన్ సర్వే

ప్రజాశక్తి-కోటవురట్ల:మండలంలోని బోడపాలెం గ్రామంలో రెవెన్యూ సిబ్బంది డ్రోన్ సర్వే నిర్వహించారు. బోడపాలెం రెవెన్యూ గ్రామంలో నీలుగుంట గ్రామ పంచాయతీ కూడా ఉండటంతో ఆ మేరకు శుక్రవారం సచివాలయ సర్వేయర్, గ్రామ రెవెన్యూ అధికారి పెద్దన్న దొర సర్వే ప్రారంభించారు. సుమారు మూడు వేల ఎకరాల సర్వే నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ అప్పలనాయుడు, గ్రామ గ్రామ సర్పంచ్ ఎరుకునాయుడు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడి

ప్రజాశక్తి -యస్.రాయవరం:మండలంలోని వేమగిరి గ్రామంలో రైతులు, డ్వాక్రా సంఘాల సభ్యులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహనా కల్పించారు. ఈ సందర్భంగా ఎంటి రామగోవింద్ మాట్లాడుతూ, ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడితో పాటు అధిక లాభాలను పొందవచ్చని తెలిపారు.గ్రామంలో మహిళా సంఘాల సభ్యులు, రైతులతో నవధాన్యాల సాగు నేల తల్లిబాగు అనే నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అబ్బాయి దొర పాల్గొన్నారు.



ర్యాలీ చేపడుతున్న సిబ్బంది

పండగలో సినీ నటుడు ఆలీ సందడి



ఆలీని సత్కరిస్తున్న ఎమ్మెల్యే ధర్మశ్రీ, అభిమానులు

ప్రజాశక్తి-రోలుగుంట: మండలంలోని శరభవరంలో గురువారం రాత్రి నిర్వహించిన పోతురాజుబాబు పండుగ మహోత్సవానికి రాష్ట్ర ఎలక్ట్రానిక్ మీడియా సలహాదారుడు, సినీ నటుడు ఆలీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చోడవరం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ మాట్లాడుతూ సినీనటుడు ఆలీ సినీ సుమారు 1200 సినిమాల్లో నటించి ఎంతో పేరు ప్రఖ్యాతులు సంపాదించుకున్నారన్నారు. ఈ సందర్భంగా ఆలీ మాట్లాడుతూ, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి శ్రీనివాసరావు, వైస్ ఎంపిపి రాజు, వైసిపి నాయకుల పంచాద చినరాయుడు, మచ్చా ప్రసాద్, కొత్తకోట సిఐ మహమ్మద్, ఎస్సై నాగకార్తీక్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

రావికమతం:మండల కేంద్రంలోని భక్తాంజ నేయ స్వామి తీర్థ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కోలాటంను రావికమతం గ్రామానికి చెందిన జనసేన నాయకులు గెంజ శ్రీనివాసుల ఆర్థిక సహాయముతో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శ్రీను మాట్లాడుతూ, కోలాటం మహిళలతో నిర్వహించడం తమకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు ప్రత్యేక చర్యలు చేపట్టారు.



మాట్లాడుతున్న రీజనల్ మేనేజర్

బీమాపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి-యస్.రాయవరం:వివిధ రకాల బీమాపై ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ మేనేజర్ సూర్యభాస్కర్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో రీజినల్ మేనేజర్ ఉదయ్ కిరణ్ మాట్లాడుతూ, ప్రధానమంత్రి జీవనజ్యోతి, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, ఎస్బిఐ జనరల్ ప్రమాద బీమాలపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో సీనియర్ మేనేజర్ వి.కాశీమోహన్ ప్రసాద్, నోడల్ ఆఫీసర్ ఎం సురేష్, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

శీతల పానీయాల పంపిణీ

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని సిహెచ్ నాగాపురంలో ఉపాధి హామి పనులు చేపడుతున్న సుమారు 100 మందికి సర్పంచ్ యలమంచిలి రఘురామ్ శీతల పానీయాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, వేసవి సమీపిస్తున్న తరుణంలో ప్రతీ ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకుల అప్పన దివాణం, గంట్ల బుచ్చిబాబు పాల్గొన్నారు.



పానీయాలు పంపిణీ చేస్తున్న సర్పంచ్



పరీక్షలు చేస్తున్న పశు వైద్యాధికారి

పశువులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-చీడికాడ:మండలంలోని జైతవరం గ్రామంలో రైతు భరోసా కేంద్రం వద్ద పశు వైద్యాధికారిని గాయత్రీ దేవి పశువులకు గర్భ కోశం నివారణ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పశువుల సంరక్షణలో జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. పశువుల ఆరోగ్య పరిస్థితులపై ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ఉండాలన్నారు. వ్యాక్సినేషన్ వేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జైతవరం సర్పంచ్ కోడూరు సత్యవతి, చీడికాడ వెటర్నరీ అసిస్టెంట్ దుగ్గిరాల మనోజ్ కుమార్, కోడూరు గోవిందరావు, పశుసంవర్ధక సహాయకులు మోర్తా శ్రీనివాసరావు పాల్గొన్నారు.



చేపట్టిన రోడ్డు నిర్మాణం

రహదారి నిర్మాణంపై హర్షం

ప్రజాశక్తి-మాడుగుల: ఎన్నో ఏళ్లుగా కలగా మిగిలిన రహదారి నిర్మాణం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మాడుగుల నుండి మోదమాంబ కాలనీ మీదుగా సాగరం వరకు రహదారి నిర్మాణానికి సుమారు నాలుగున్నర కోట్లు నిధులు మంజూరు అయ్యాయి. ప్రస్తుతం మాడుగుల దేవి ఆలయం వద్ద నుండి మోదమాంబ కాలనీ వరకు రూ.85 లక్షలతో సిసి రహదారి నిర్మాణం ప్రారంభమైంది. కాలనీ నుండి పాడేరు ఆర్అండ్‌బి రహదారి సాగరం వరకు తారు రోడ్డు నిర్మాణం ప్రారంభం కానుంది. మార్గమధ్యలో వంతెన నిర్మాణం కూడా చేపడతారు. ఈ మార్గంలో వంతెన లేకపోవడంతో మాడుగులకు చెందిన రైతులు వర్షాకాలంలో తమ పొలాలకు వెళ్లలేని పరిస్థితి ఉండేది. దీంతోపాటు మాడుగుల మోద మాంబ కాలనీ ప్రజలు సైతం రహదారి లేక ఇబ్బందులు పడేవారు. ప్రస్తుతం రహదారి నిర్మాణం ప్రారంభం కావడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ రహదారి పూర్తి అయితే మండలంలోని అనేక గ్రామాల ప్రజలు ఘాట్ రోడ్డు మీదుగా కాకుండా సత్యవరం మీదుగా నేరుగా మాడుగులకు రాకపోకలు సాగించే అవకాశం ఉంది.



వంటశాలను పరిశీలిస్తున్న ఆర్‌డిఒ జయరాం

గురుకుల పాఠశాలను ఆర్‌డిఒ తనిఖీ

ప్రజాశక్తి -నర్సీపట్నం రూరల్:బాలయోగి మహిళ గురుకుల పాఠశాలను ఆర్డీవో హెచ్‌వి.జయరాం శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. అనంతరం వంటశాలలో భోజనాలను పరిశీలించారు. పిల్లలకు ఎటువంటి లోటుపాట్లు లేకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ కనకారావు, ప్రిన్సిపాల్ సునీత ఉన్నారు.

వసతి గృహాల సందర్శన

ప్రజాశక్తి -కోటవురట్ల:మండల కేంద్రంలో బాలికల, ఇంటిగ్రేటెడ్, కస్తూరిబా వసతి గృహాలను శుక్రవారం మండల ప్రత్యేక అధికారి భాగ్యశ్రీ సందర్శించారు. వసతి గృహాలలో సౌకర్యాలను, భవనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందిస్తున్న మెనూ వివరాలు అడిగి తెలుసుకున్నారు. అసంపూర్తిగా ఉన్న వసతి గృహాల వివరాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రశేఖర్, ఈఓపిఆర్‌డి ప్రేమ్ కుమార్, ఇంటిగ్రేటెడ్ వార్డెన్ గోపీనాథ్, కస్తూరిబా పాఠశాల ప్రత్యేక అధికారి సరితా దేవి, బాలికల వసతి గృహ వార్డెన్ రాజేశ్వరి పాల్గొన్నారు.

ఆర్‌ఐగా ఉర్థవరావు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - కోటవురట్ల: మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ గా కే.ఉర్థవరావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేసిన ఆర్ఐ రవి అనకాపల్లి కలెక్టర్ కార్యాలయానికి బదిలీ కావడంతో, పాయకరావుపేట లో పని చేస్తున్న ఆయన విధుల్లో చేరారు. గతంలో మండలానికి ఇద్దరు ఆర్ఐలు ఉండగా ప్రస్తుతం ఒక్కరే ఉండడం పట్ల ఇటు సిబ్బంది, అదేవిధంగా ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



ఆర్ఐ ఉర్థవరావు

పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి రమాప్రభ ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి రమాప్రభ

ప్రజాశక్తి -సీతమ్మధార:విశాఖ నగరం, అక్కయ్యపాలెంలోని పలు ప్రాంతాల్లో ఉత్తరాంధ్ర పట్టభద్రుల పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభ విస్తృత ప్రచారం నిర్వహించారు.పలు పాఠశాలల్లోని ఉపాధ్యాయులను కలిసి, ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓటును తనకు వేసి గెలిపించాలని అభ్యర్థించారు.చట్టసభల్లో ప్రజల తరపున ప్రశ్నించే గొంతు అవసరం ఎంతైనా ఉందన్నారు. పెద్దఎత్తున డబ్బుతో ప్రలోభపెట్టి, గెలవాలని ప్రయత్నించే రాజకీయపార్టీలకు ఓటుతో సమాధానం చెప్పాలని పిలుపునిచ్చారు. విద్యావేత్తలు, మేధావులు, 250 ప్రజాసంఘాల మద్దతుతో పోటీలో ఉన్న తనను గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజు, మహిళా సంఘం నేత మాధవి, పోర్టు నాయకులు స్వతంత్రకుమార్, ఎస్ఎఫ్ఐ కార్యదర్శి నాయుడు పాల్గొన్నారు.

సిపిఎం, సిఐటియు నేతల ప్రచారం

ప్రజాశక్తి- భీమునిపట్నం : ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న డాక్టర్ కోరెడ్ల రమాప్రభ గెలిపించాలని కోరుతూ సిపిఎం, సిఐటియు నేతలు శుక్రవారం పలు గ్రామాల్లో కరపత్రాలను పంచుతూ ప్రచారం నిర్వహించారు. పట్టభద్రుల ఓటర్లను కలిసి, పిడిఎఫ్ అభ్యర్థి రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. సిపిఎం భీమిలి మండల కార్యదర్శి రవ్వ నర్సింగరావు, సిఐటియు నేత వాళ్ల నాగరాజు, ఆ పార్టీ నాయకులు బృందంగా బీచ్ రోడ్‌లోని చేపలుప్పాడ, మంగమారిపేట, కాపులుప్పా డ, తిమ్మాపురం, కె నగరపాలెం, నేర్ల వలస గ్రామాల్లో ఎన్నికల ప్రచారం చేశారు.



భీమిలిలో ప్రచారం చేపడుతున్న నేతలు

బిసి హాస్టల్‌కు భవనం మంజూరు చేయాలని..

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా

ప్రజాశక్తి-నక్కపల్లి:నక్కపల్లిలో బీసీ హాస్టల్ కు నూతన భవనం మంజూరు చేసి, విద్యార్థుల ఇబ్బందులను తొలగించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద హాస్టల్ విద్యార్థులతో కలిసి ధర్నా చేపట్టారు. బీసీ బాలుర వసతి గృహం చాలా అధ్వానంగా ఉందని, మౌలిక వసతులు, మరుగుదొడ్లు సక్రమంగా లేవని దీంతో హాస్టల్ విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రమణ, ఉపాధ్యక్షులు బాబ్జి, కార్యదర్శి రమణ, కోశాధికారి తరుణ్, సహాయ కార్యదర్శి బాలాజీ ఆవేదన వ్యక్తం చేశారు. బీసీ బాయ్స్ హాస్టల్ కు సొంత భవనం లేకపోవడంతో అద్దె భవనంలో ఉంటున్నారని, అద్దె భవనం పూర్తిగా అధ్వానంగా ఉందని ఆవేదన వెలిబుచ్చారు. అనేకసార్లు సమస్యను అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా నేటి వరకు పరిష్కారానికి మార్గం చూపలేదన్నారు. విద్యార్థుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరైన పద్ధతి కాదన్నారు. గత సంవత్సరం హాస్టల్లో 200 మంది విద్యార్థులు ఉండేవారని,ప్రస్తుతం హాస్టల్లో వసతి సౌకర్యం సక్రమంగా లేనందున 40 మాత్రమే విద్యార్థులు ఉంటున్నారన్నారు. బీసీ హాస్టల్ కు సొంత భవనం లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. వెంటనే అధికారులు స్పందించి భవన నిర్మాణ పనులను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో విద్యార్థులతో కలిసి చలో కలెక్టరేట్ నిర్వహిస్తామన్నారు. ఎంపీడీవో సీతారామరాజు, ఎంఈఓ డివిడి ప్రసాద్ లకు వినతిపత్రం అందజేశారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని అధికారులు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్సీ హాస్టల్ లోకి మార్పు
ఎంపీడీవో సీతారామరాజు

జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు బీసీ హాస్టల్ విద్యార్థులను ఎస్సీ హాస్టల్లోకి మార్పు చేస్తున్నట్లు ఎంపీడీవో సీతారామరాజు తెలిపారు . శుక్రవారం అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్, ఎంఈఓ డివిడి ప్రసాద్‌లతో కలిసి నక్కపల్లి బీసీ, ఎస్సీ హాస్టల్, గొడిచెర్లలో బీసీ వెల్ఫేర్ హాస్టల్‌ను తనిఖీ చేశారు. వసతి గృహాల్లో నెలకొన్న వసతి సౌకర్యం, మరుగుదొడ్లు, లైట్లు ఫ్యాన్లు, తాగునీరు, దోమలు బెడద తదితర సమస్యలను క్షుణంగా పరిశీలించారు. వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలను విద్యార్థులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఎంపీడీవో మాట్లాడుతూ, నివేదికను జిల్లా కలెక్టర్ కు అందజేస్తామన్నారు. స్థానిక గురుకులం ను సందర్శించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.



ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులతో మాట్లాడుతున్న అధికారులు

ట్రాఫిక్ నిబంధనలపై ర్యాలీ

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:ట్రాఫిక్ నిబంధనలపై నర్సీపట్నంలో పట్టణ, రూరల్ పోలీసుల ఆధ్వర్యంలో భారీ ఎత్తున అవగాహన ర్యాలీ నిర్వహించారు. నర్సీపట్నం ఇన్చార్జి డిఎస్పి కే.ప్రవీణ్ కుమార్ ప్రారంభించిన ఈ ర్యాలీలో సుమారు 500 మంది వివిధ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. పట్టణ సీఐ నమ్మి గణేష్, రూరల్ సీఐ రమణయ్యలు హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న వాహన చోదకులను ఆపి రహదారి భద్రత పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డిఎస్పి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ, హెల్మెట్, సీట్ బెల్ట్‌లను వాహనదారులు ఉపయోగించాలని సూచించారు. పట్టణ సీఐ నమ్మి గణేష్ మాట్లాడుతూ, హెల్మెట్ ధరించకపోవడంతో అనేక మంది ప్రాణాలు కోల్పోయారని, వారి కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఆయన అన్నారు.అనంతరం అబిద్ సెంటర్‌లో మానవహారాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ రూరల్ ఎస్సైలు గోవిందరావు, ధనుంజయ నాయుడు, రామారావు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



ర్యాలీ చేపడుతున్న పోలీసు అధికారులు, విద్యార్థులు



పరిశీలిస్తున్న డిఎస్పీ ప్రవీణ్‌కుమార్

వంద మందితో పోలీసు బందోబస్తు

- నర్సీపట్నం డిఎస్‌పి ప్రవీణ్‌కుమార్

ప్రజాశక్తి-గొలుగొండ:మహాశివరాత్రి ఉత్సవాల్లో భక్తులకు రక్షణ కల్పించేందుకు 100 మంది పోలీసులను బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు నర్సీపట్నం డిఎస్పీ ప్రవీణ్‌కుమార్ వెల్లడించారు. శుక్రవారం ధారమఠం విచ్చేసిన ఆయన సిఐ రమణయ్య, గొలుగొండ ఎస్సై నారాయణరావు, కమిటీ సభ్యులతో కలిసి ఆలయ ప్రాంగణం, జలపాతాల వద్ద సౌకర్యాలను పరిశీలించారు. మహిళలకు ప్రత్యేక వసతులు కల్పించి వారికి మెరుగైన సౌకర్యాలు ఉండాలన్నారు. భక్తులకు రెండు మార్గాల్లో దర్శనం కల్పించాలన్నారు. గర్భ గుడిలోకి ఎవరిని అనుమతి ఇవ్వకుండా ద్వారం వద్ద నుండే దర్శనం చేసుకోవాలని సూచించారు. గుడి, జలపాతాలు, ప్రాంగణం, పార్కింగ్ అన్ని ఒక క్రమపద్ధతిలో ఉండేలా చూడాలన్నారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మెన్ అల్లు సత్యనారాయణ, పలువురు కమిటీ సభ్యులు, పూజారి మణి పాల్గొన్నారు.